

STUDY ABROAD

TOP GLOBAL DESTINATIONS

Free IELTS coaching

GradsUniverse

+91 6301726400



ESTD: 1999

www.voodayam.com

# వుదయం



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6:31

సహర్ (ఉదయం) 5:00



హైదరాబాద్ 17-03-2026 మంగళవారం | సంపుటి : 27 | సంచిక : 14 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on




# లక్ష్యం సమ్మిళిత తెలంగాణ

## సంపూర్ణ అభివృద్ధి కల సాకారం దిశగా రాష్ట్రం ప్రయాణం

## ఉభయ శాసన సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

బలహీన వర్గాలకు భరోసాగా ప్రపంచానికి ఆదర్శంగా పథకాలు

ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణ ● ప్రారంభమైన తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

**హైదరాబాద్, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని గవర్నర్ గారు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. సోమవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో తొలిరోజు సభకు హాజరైన సభ్యులందరికీ గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒక చారిత్రక మార్పు దశలో తెలంగాణ నిలబడిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఎంచుకునే ప్రతి పాలసీ, అమలు చేసే ప్రతి కార్యక్రమం, చేపడుతున్న ప్రతి సంస్కరణ ఈ ప్రాంత ప్రజలకు అవకాశాలను సృష్టిస్తోందన్నారు. సమ్మిళిత వృద్ధి దిశగా వారిని నడిపించి మరింత శక్తివంతులుగా తయారు చేస్తుందన్నారు. రాష్ట్ర సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధిపై ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉందన్న గవర్నర్.. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అందుకోసం బలమైన పునాదులు వేసేందుకు ఏడాది కాలంలో ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గడిచిన రెండేండ్లుగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్న ఆయన నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు. సమున్నతమైన ఆశయంతో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు.

**అభివృద్ధికి వికేంద్రీకరణ వ్యూహం..**

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అంచెలంచెలుగా వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరించిందని గవర్నర్ శుక్లా తెలిపారు.

మిగతా 2లో

# 20 న రాష్ట్ర బడ్జెట్

● 30 వరకు అసెంబ్లీ ● నేడు, రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

● సీఎం సమాధానం ● 19 న ఉగాది సెలవు

● గవర్నర్ ప్రసంగంపై బిఆర్ఎస్ నల్ల బ్యాడ్జీల నిరసన

● వందేమాతరం అలాపనపై ఎంఐఎం వాకౌట్

● శాసన సభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ ● కాంగ్రెస్ సభ్యులకు సీఎం దిశానిర్దేశం



**హైదరాబాద్, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ సమావేశాలను మార్చి 16 నుండి మార్చి 30వ తేదీ వరకు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. నేడు, రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సీఎం సమాధానం ఉండనుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మరుసటి రోజు 20న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ నెల 23 నుంచి వివిధ శాఖల పద్దులపై చర్చలు ప్రారంభమవుతాయి. ఈ నెల 30న బడ్జెట్ ఆమోదం పొందిన తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడుతుంది. కాగా పక్షం రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై సభలో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సమావేశాల కాలాన్ని మార్చి నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే సభలో పొలిటికల్ హీట్ రాజుకుంది. అసెంబ్లీలో 'వందేమాతరం' గీతాలాపన చేయడాన్ని నిరసిస్తూ ఎంఐఎం సభ్యులు

మిగతా 2లో

# ప్రతి పక్షాన్ని దీటుగా ఎదుర్కోండి

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

సభలపై నిర్లక్ష్యం వద్దు.. సభ్యులందరూ సభకు హాజరుకావాల్సిందే

వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలి


గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయింది

భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నారో చెప్పండి

గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్

సీఎల్పీ భేటీలో కాంగ్రెస్ సభ్యులకు సీఎం దిశానిర్దేశం

మంత్రులు సమయమివ్వాలి




**హైదరాబాద్, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సీఎల్పీ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాలల్లో అనుసరించాల్సిన వ్యూహంపైన సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు.

మిగతా 2లో

# సిధా రెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

## అనిమేష కవితా సంపుటికి వరించిన గౌరవం



**హైదరాబాద్, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ అక్షర వెలుగు, ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించారు. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం. ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనాన్ని ఈ సంపుటిలో కళ్లకు కట్టారు. మరోవైపు మానవ సంబంధాల విచ్ఛిన్నత, సమాజంలో ఒంటరితనం, ఆందోళన, సామాజిక కలతలను ప్రతిబింబింపజేసే నందిని సిధారెడ్డి కవిత్వం పాఠకులకు ప్రేరణగా నిలుస్తోంది.తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన కవిత్వం ద్వారా గొప్ప సహకారం అందించి తెలంగాణ సాహిత్యానికి ఆయన గర్వకారణంగా నిలిచారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా పనిచేశారు.

మిగతా 2లో

# యుద్ధం యాధాతథం



**వుదయం డెస్క్, మార్చి 16 :** డ్రోన్ దాడి తర్వాత యుఎఇలోని పుజైరా చమురు పరిశ్రమ ప్రాంతంలో మంటలు చెలరేగాయని అధికారులు ధృవీకరించారు. ముఖ్యంగా, ఈ ఓడరేవు హార్ముజ్ జలసంధిని బేపాస్ చేసే దేశంలోని ఏకైక ఎగుమతి మార్గంగా పనిచేస్తుంది. ఇలా ఉండగా, దుబాయ్ విమానాశ్రయం విమానాలను తాత్కాలికంగా నిలిపివేసింది. దుబాయ్ విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న సౌకర్యాలపై డ్రోన్ దాడి తర్వాత దాని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలను క్లుప్తంగా నిలిపివేసింది. ఈ సంఘటనలో ఇంధన ట్యాంకులు దెబ్బతిన్నాయని, అత్యవసర బృందాలు పరిస్థితిని చక్కదిద్దుతుండగా అనేక విమానాలు విమానాశ్రయం వెలుపల తిరుగుతున్నాయని అధికారులు తెలిపారు. మరొక దాడి కారణంగా స్వల్ప అంతరాయం ఏర్పడిన కొన్ని రోజుల తర్వాత ఈ పరిస్థితి ఏర్పడింది. దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయం నుండి నడుస్తున్న అతిపెద్ద విమానయాన సంస్థ ఎమిరేట్స్ కూడా విమానాలను నిలిపివేసినట్లు ధృవీకరించింది. యుఎఇలో 19 మంది భారతీయుల అరెస్టు ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా ఏర్పడిన ఉద్రిక్తతల సమయంలో తప్పుదారి పట్టించే, కల్పిత కంటెంట్ ఉన్న వీడియో క్లిప్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో

మిగతా 3లో

# రికార్డు స్థాయిలో ధాన్యం కొంటాం

● రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు

● 54.48 లక్షల ఎకరాల్లో 152.03 లక్షల మె. ట ధాన్యం దిగుబడి అంచనా

● రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● గ్రేడ్-ఏ కు క్వింటాల్ కు 2,389 మద్దతు ధర ఇచ్చేందుకు నిర్ణయం

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 16 (ఎఎంస్) :** 2025-26 రబీ సీజన్‌లో ముందెన్నడూ లేని రీతిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రబీ సీజన్లో54.48 లక్షల ఎకరాల్లో 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రబీ సీజన్ కు సంబం ధించి ధాన్యం కొనుగోళ్లు ,కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాట్లపై సోమవారం ఉదయం బేగంపేటలోని ఐ.ఏ.ఎస్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి అదనపు కలెక్టర్లు,జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు, ఆయా జిల్లాల సివిల్ సప్లయ్స్ మేనేజర్లతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2025-26 రబీ సీజన్లో ఉత్పత్తి అయిన ధాన్యం దిగుబడిలో వ్యవసాయ రంగ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సమగ్రమైన కార్యాచరణను రూపొందించామని చెప్పారు.

మిగతా 2లో

# హైదరాబాద్ లో 13 యూకే స్కూల్ క్యాంపస్‌లు

## నేడు ప్రతినిధి బృందం రాక

**హైదరాబాద్, మార్చి 16 (ఎఎంస్) :** దేశంలోనే అత్యద్భుతమైన వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కల్గిన హైదరాబాదు మహానగరానికే అంతర్జాతీయ సంస్థలు జై కొడుతున్నాయి. ఇదివరకు ఐటీ కంపెనీలు, బయో సంబంధిత సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఆసక్తి చూపుతుండగా.. తాజాగా విద్యా సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు చెందిన 13 ప్రఖ్యాత పాఠశాలలు హైదరాబాద్ నగరంలో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు యూకే ప్రభుత్వం నుంచి తెలంగాణ సర్కారుకు గ్రీన్ సిగ్నల్ అందింది. అందులో భాగంగా యూకే డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. రేపు(మార్చి 18న) రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నతాధికారులతో యూకే ప్రతినిధులు కీలక సమాలోచనలు జరపనున్నారు.

మిగతా 2లో

# సుంకాల తరువాతే ఒప్పందం

## అమెరికా కొత్త సుంకాలను ఖరారు చేసిన తరువాతే దానితో వాణిజ్య అంగీకారం : రాజేశ్ అగర్వాల్



**న్యూఢిల్లీ, మార్చి 16 (వుదయం) :** వాషింగ్టన్ నూతన ప్రపంచ సుంకాల చట్రాన్ని ఖరారు చేసిన తర్వాతే భారతదేశం అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తుందని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అన్నారు. అమెరికా సుంకాల విధానంలో కొనసాగుతున్న మార్పులు ఈ ఒప్పందం కోసం అంచనా వేసిన మార్చి కాలక్రమాన్ని ఆలస్యం చేశాయని సూచించారు. అమెరికా ప్రపంచవ్యాప్తంగా సుంకాల వ్యవస్థను పునర్నిర్మిస్తున్నదని, భారతదేశంతో ఏదైనా ఒప్పందం ఆ నిర్మాణంతో సమలేఖనం కావాలని అగర్వాల్ అన్నారు. భారతదేశం రష్యన్ చమురు కొనుగోళ్లను పెంచుతూనే ఉందని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కెనడాతో చర్చలు పురోగమిస్తున్నాయని కూడా ఆయన ధృవీకరించారు. అమెరికా సుంకాల సవరణ వాణిజ్య ఒప్పందాన్ని ఆలస్యం చేస్తోంది. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై మార్చిలో సంతకాలు జరుగుతాయని ముందుగా భావించినప్పటికీ, అమెరికా సుంకాల విధానంలో పరిణామాల కారణంగా పరిస్థితి మారిందని అగర్వాల్ అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పుల తర్వాత అంతర్జాతీయ అత్యవసర ఆర్థికఅధికారాల చట్టం (ఐఇఇపిఎ) కింద ఉన్న సుంకాలు ఇకపై అదే రూపంలో ఉండవని ఆయన పేర్కొన్నారు. బదులుగా, ఆర్టికల్ 122 ప్రకారం ఇప్పుడు దాదాపు 10శాతం ప్రపంచ సుంకం అమలులో ఉంది. అమెరికా విస్తృత సుంకం వ్యవస్థను పునఃరూపకల్పన చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆయన అభిప్రాయం ప్రకారం, భారతదేశం సంతకం చేసే ఏ ఒప్పందానికైనా ఈ కొత్త చట్రానికి అనుగుణంగా చర్చలు జరపాల్సి ఉంటుంది. అమెరికా ప్రపంచవ్యాప్తంగా సుంకాల వ్యవస్థను పునఃసృష్టించడానికి ప్రయత్నిస్తోంది. ఆ నిర్మాణం అమల్లోకి వచ్చిన తర్వాత, ఒప్పందంపై సంతకం చేయడం మంచిది. కొత్త ప్రపంచ సుంకాల వ్యవస్థ ఖరారు అయిన తర్వాతే వాస్తవ సంతకం జరుగుతుంది,

2లో

# ధైర్యం ఉంటే నా ఇంటిపై దాడి చేయండి

## బిజెపి నాయకులకు మమత సవాలు



**కోల్‌కత, మార్చి 16 (వుదయం) :** రాష్ట్రంలో తమ పార్టీ నాయకులపై దాడులను బిజెపి నాయకులు సమర్థిస్తున్నారని ఆరోపిస్తూ, ధైర్యం ఉంటే తన ఇంటిని, తృణమూల్ కాంగ్రెస్ నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బిజెపికి సోమవారం సవాలు విసిరారు.

మిగతా 2లో

# దుబాయ్‌కి ఎయిర్ ఇండియా విమానాలు బంద్

**న్యూఢిల్లీ, మార్చి 16 (వుదయం డెస్క్) :** దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద డ్రోన్ దాడి, భారీగా అగ్ని రాజుకోవడంతో దుబాయ్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలన్నింటినీ సోమవారం ఎయిర్ ఇండియా సస్పెండ్ చేసింది. విమానాశ్రయం సమీపంలో ఉన్న ఒక ఆయల్ ట్యాంకర్‌ను డ్రోన్ తాకడంతో అగ్ని ప్రమాదం జరిగింది. "దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం అక్కడి నుంచి బయలుదేరే అన్ని విమాన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఫలితంగా, ఎయిర్ ఇండియా, ఎయిర్ఇం డియా ఎక్స్‌ప్రెస్ విమా నాలు దుబాయ్‌కు బయలుదేరే విమానాలను నేడు రద్దు చేశారు అని టాటా యాజమాన్యంలోని వైమానిక సంస్థ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్ట్ చేసింది. ప్రయాణీకులకు రీబుకింగ్ లేదా రద్దు చేసుకోవడం, లేదా తమ విమాన టికెట్పూర్తి వాపసు పొందడం వంటి ఎంపికలను కల్పిస్తున్నట్లు ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రయాణీకులకు సహాయం చేయడానికి, చిక్కుకుపోయిన ప్రయాణీకులను వీలైనంత త్వరగా సురక్షితంగా ఇంటికి తీసుకురావడానికి తమ బృందాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయి అని సంస్థ పేర్కొంది. అయితే, అబుదాబి, రస్ అల్ ఖైమా, షార్జాలకు వెళ్లే, తిరిగి వచ్చే ఎయిర్ఇం డియా ఎక్స్ ప్రెస్ తాత్కాలిక విమాన కార్యకలాపాలు ప్రకటించిన విధంగానే కొనసాగుతాయని విమాన సంస్థ తెలిపింది.

మిగతా 3లో







# లక్ష్యం సమ్మిళిత తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించిందని చెప్పారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం, పౌర సేవలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి తోడు కోర్ అర్బన్ రీజియన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించినట్లు గవర్నర్ తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులు, ట్యాంకులను పునరుద్ధరించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించిందన్న గవర్నర్...హైడ్రా ఏర్పాటు ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుందన్నారు.

### ఆధునీక నగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను ఆధునాతన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 55 కి.మీ. మేరకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టును చేపట్టిందని గవర్నర్ వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న ప్రాంతంలో (పెరి–అర్బన్ రీజియన్) మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎకో–ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్ కంపెనీలతో మౌలిక సదుపాయాల హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత కీలక గమ్యస్థానంగా నిలిచిందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్ నిర్వహించడంతో పాటు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల్లోని ప్రముఖులతో రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించిందన్నారు. ఎగుమతుల్లో తెలంగాణ దేశంలోనే 7వ స్థానంలో నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా రేడియల్ రోడ్లు, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణె నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లతో రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుందన్నారు.

### గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్

తెలంగాణ పురోభివృద్ధికి 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని గవర్నర్ వివరించారు. ఇంధన రంగంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 23,187 మెగావాట్లకు పెరిగిందన్న ఆయన..ఇందులో 44.55 శాతం పునరుత్పాదక వనరుల నుంచి రావడం ప్రశంసనీయమన్నారు.

### వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా రైతులు

రైతులను వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను చేపట్టినట్లు గవర్నర్ వివరించారు. ఇందులో భాగంగా రూ. 20,616 కోట్ల పంట రుణాల మాఫీ, సన్నరకం వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్, పెట్టుబడి సహాయంగా రైతు భరోసా, గిట్టుబాటు ధరలకు ధాన్యం సేకరణ, సౌర శక్తితో నడిచే పంప్ సెట్లకు తీసుకుంటున్న చర్యలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూమి సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారానికి తెలంగాణ భూ భారతి చట్టం అమలులోకి తేవడంతో పాటు సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. **సంక్షేమానికి పెద్దపీట**.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశ్యంతో ప్రతి కుటుంబానికి సంక్షేమంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు గవర్నర్ చెప్పారు. ఇందులో భాగంగా కొన్నేండ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేశామన్నారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి ప్రతి లబ్దిదారుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నట్లు వివరించారు. రూ. 22,500 కోట్లతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నామన్న గవర్నర్... మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక బృందాలను వ్యాపారస్తులుగా మార్చేందుకు వేగంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే మహత్తర చర్యలతో ముందుకు వెళుతోందన్నారు. మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం కోసం ఇప్పటివరకు 269.68 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా, తద్వారా రూ. 9,222 కోట్లకు పైగా మహిళలు ఆదా చేసుకున్నారన్నారు. మహాలక్ష్మి పథకంలో 42.90 లక్షల కుటుంబాలకు సబ్సిడీపై రూ.500లకు ఎల్ పీజీ సిలిండర్ అందిస్తున్నామన్నారు. గృహజ్యోతి కింద పేదల గృహాలకు 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న కార్యక్రమంతో 53.09 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయన్నారు.

### నూతన విద్యా విధానానికి కసరత్తు

విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం నూతన విద్యా విధానానికి కమిటీని ఏర్పాటు చేసిందని గవర్నర్ వెల్లడించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను 212 శాతం పెంచడంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. యువతలో నైపుణ్యతను పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపించడం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను ఏటీసీలుగా మార్చినట్లు చెప్పారు.

### రూ. 11 వేల కోట్లతో వైద్యమౌలిక వసతులు

రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని గవర్నర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 11 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా కొత్త ఆసుపత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం వంటివి ఈ ఏడాది చివరి నాటికి సేవలను అందుబాటులోకి తేవాలన్న కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకెళ్లడానికి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణను ప్రారంభించిందని గవర్నర్ తెలిపారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాడనికి ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజావాణిలో ఇప్పటివరకు 64,697 అర్జీలు అందగా, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 47,670 విజ్ఞప్తులను పరిష్కరించినట్లు వివరించారు.

సామాజిక న్యాయమే లక్ష్యంగా రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించామని చెప్పారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో ముందడుగు వేసి 59 ఎస్సీ కులాలను రిజర్వేషన్ వర్గీకరణ పూర్తి చేశామన్నారు. మాదక ద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి కల్పించాలన్న దృఢనిశ్చయంతో ఈగల్ ఏర్పాటు చేశామన్న గవర్నర్...ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం పీఎస్సీ పునరుద్ధరణతో పాటు రికార్డు సమయంలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. సినిమా రంగంలో ప్రతిభను గుర్తించడానికి గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రారంభించినట్లు గవర్నర్ వివరించారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ సంరక్షణలో భాగంగా దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పుణ్య క్షేత్రాల అభివృద్ధి, వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు.

# హైదరాబాద్‌లో 13 యూకే స్కూల్ క్యాంపస్‌లు

మొదటి పేజీ తరువాయి

కీలక దశకు చర్యలు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటు మేరకు అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి ఆహ్వానించేందుకు ప్రజా ప్రభు త్వం తీవ్ర కసరత్తులు చేస్తున్నది. ఈ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో 13 యూకే స్కూల్స్‌కు సంబంధించిన రిప్రజేంటెటివ్స్, యూకే ప్రభుత్వ అధికారులు పాల్గొనను న్నారు. తెలంగాణలోకి రానున్న ప్రైవేటు విద్యా సంస్థలు, కేజీ టూ ప్లస్ 2 కరికులంలో అగ్రగామిగా పేరొందాయి. స్థానికంగా విద్యాశాఖ ఉన్నతాధికార ులు, వివిధ శాఖలు మున్సిపల్, విద్యా, ఐటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన అధికారులు చర్చించనున్నారు. ఈ విషయంలో మరింత సమన్వయం, యూకే విద్యా సంస్థలు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయేవాటికి ఏ విధమైన టైమ్ లైన్ ను నిర్దేశించుకుని వెళ్ళాలో చర్చలు సాగనున్నాయి. అయితే, యూకేకు సంబంధించిన విశ్వవిద్యాలయాలు సైతం తెలంగాణలో వారి క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలన్నీ ఒక కీలక దశకి చేరుకున్న విషయం విదితమే.

**క్యాంపస్‌లు ఎక్కడ..?** ఈ క్యాంపస్‌లు ఎక్కడ పెట్టాలన్న దానిపై తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చలు చేస్తున్నప్పటికీ, మరొవైపు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే ప్రత్యేకంగా ఒక ఎడ్యుకేషన్ జోన్ లో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడుగులు పడుతున్నాయి.

# సుంకాల తరువాతే ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

అని అగర్వాల్ అన్నారు. కొత్త వ్యవస్థపై స్పష్టత వచ్చిన తర్వాత ఒప్పందాన్నిఖరారు చేయడానికి ఇరు పక్షాలూ సిద్ధంగా ఉన్నాయని, అమెరికా ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేస్తుందనే దానిపై ఇది ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. పెరిగిన రష్యా చమురు కొనుగోళ్లు, కెనడాతో ఎఫ్‌టిఎ చర్చలు కొనసాగుతాయి ఇంధన వాణిజ్యంపై మాట్లాడుతూ, భారతదేశం రష్యా నుండి ముడి చమురు దిగుమతులను పెంచిందని అగర్వాల్ ధృవీకరించారు. భారత్ రష్యన్ చమురును కొనుగోలు చేస్తోంది. రష్యా నుండి కొనుగోళ్లలో పెరుగుదల ఉంది, అని ఆయన ఇతర వివరాలు చెప్పకుండా అన్నారు. కెనడాతో ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అప్‌డేట్‌ను కూడా ఆయన అందించారు, వర్చువల్ సమావేశాల ద్వారా చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరులో ఇరు పక్షాలు మరిన్ని ఆన్‌లైన్ చర్చలు నిర్వహించే అవకాశం ఉందని, మొదటి విడత వ్యక్తిగత చర్చలు ఏప్రిల్ లేదా మే నెలల్లో జరిగే అవకాశం ఉందని చెప్పారు. కెనడా చర్చలు, అమెరికా చర్చల వేర్వేరుగా జరుగుతున్నాయని, అయితే వాణిజ్య భాగస్వామ్యాలను విస్తరించడానికి భారతదేశ విస్తృత ప్రయత్నంలో భాగంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

## ధైర్యం ఉంటే నా ఇంటిపై
# దాడి చేయండి

మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల మధ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల కొరత ఉందనే నివేదికలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తృణమూల్కాం గ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా సభలో మాట్లాడుతూ, రాష్ట్రమంత్రి శశి పాంజా ఇంటిపై ఆరోపిత దాడి విషయంలో బిజెపికి తీవ్రమైన హెచ్చరికను మమత చేశారు. ధైర్యం ఉంటే నా ఇంటిపై, ఇతర టిఎంసి నాయకుల ఇళ్లపై దాడి చేయండి అని బిజెపికి సవాలు విసురుతూ, ఎలా ప్రతిఘటించాలో తమకు తెలుసు అని స్పష్టం చేశారు. కోల్‌కతాలోని గిరీష్ పార్క్ ప్రాంతంలో పశ్చిమ బెంగాల్ మంత్రి శశి పంజా నివాసంపై రాళ్లు రువ్వారనే ఆరోపణలు వెలువడిన తర్వాత ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేసినట్లు పిటిఐ వార్తా సంస్థ పేర్కొంది. ఘర్షణలో పాల్గొన్నారనే ఆరోపణలతో నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు, ఈ సంఘటనతో సంబంధం ఉన్న ఇతరులను పట్టుకోవడానికి దాడులు జరుగుతున్నాయి. ఈ దాడికి బిజెపి కుట్ర పన్నిందని బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ర్యాలీ రోజున జరిగిన ఆరోపిత హింసను ఆమె ఖండించారు. ప్రధాని ర్యాలీ రోజున బెంగాల్ మంత్రి శశి పంజా ఇంటిపై సాంఘిక వ్యతిరేక శక్తులచే దాడి చేయించినందుకు బిజెపి సిగ్గుపడాలి అని మమత విమర్శించారు.

# దీటుగా ఎదుర్కోండి

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని ఇక మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే దానిపై దృష్టిసారించాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడవ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదన్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ ప్రసంగంలో వివరించారని చెప్పారు. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృధా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని సీఎం సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు సబ్జెక్ట్ మాట్లాడటానికి కూడా సమయం ఇవ్వలేదని సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని, సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరం అని సీఎం చెప్పారు.

### పూర్తి స్థాయిలో అసెంబ్లీ కమిటీలు

అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సీఎం తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుందని తెలిపారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలన్నారు. ఇది మన ప్రభుత్వం ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై సభ్యులు ఫోకస్ పెట్టాలని, 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని ఆదేశించారు.

# సిధా రెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

మొదటి పేజీ తరువాయి

తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కవిత్వం మాత్రమే కాకుండా తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. అలాగే.. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను సిద్ధారెడ్డి ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది.

**తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్**.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత, భాషా సాహిత్యాల వికాసం కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి చైర్మన్‌గా నందిని సిధారెడ్డి సేవలు అందించారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక పుస్తకాలను ఆయన వెలుగులోకి తెచ్చారు.

**తెలంగాణకు గర్వకారణం : సీఎం రేవంత్ రెడ్డి**

నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడంపై సీఎం రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన “అనిమేష” కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంతో తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సిద్ధారెడ్డికి సరైన గౌరవం : కేటీఆర్**

నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సిధారెడ్డికి శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ పెట్టారు. తెలంగాణ కవి, రచయిత, ఉద్యమకారుడు నందిని సిధారెడ్డికి కేంద్రం అరుదైన గౌరవం కల్పించిందన్నారు. కరోనా కాలంలోని పరిస్థితులపై ఆయన రాసిన అనిమేష కవితా సంపుటికి ఈ పురస్కారం లభించిందన్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొంటాం

మొదటి పేజీ తరువాయి

అందులో 60 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం,30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నాలు ఉంటాయన్నారుధాన్యం కొనుగోలులో రైతాంగానికి ఎక్కడా అవాంతరాలు ఎదురు కాకుండా ఉండేందుకు ధాన్యం ఉత్పత్తికి తగ్గట్టు రాష్ట్ర వ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. చదానికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రప్రభుత్వం నిర్ణయానుసరంగా మద్దతు ధర చెల్లించేందుజు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గ్రేడ్–ఏ,సాదారణ విభాగలుగా గుర్తించి గ్రేడ్–ఏకూ2,389,సాధారణ వరికి 2,369 చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగాపెరిగిన మద్దతు ధరతో రైతాంగానికి పెద్ద ఎత్తున లబ్ది చేకూరుతుందని మంత్రి చెప్పారు. తద్వారా రైతాంగానికి ఆదాయం పెరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను పెంచడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో టార్బాలిన్ షీట్లు,ఎలక్ట్రానిక్ తుకాలు,తేమను కొలిచే పరికరాలు, ఆటోమేటిక్ వరి క్లినర్లు,డిజిటల్ డయల్ కాలిపర్స్, హస్క్ రిమువర్ల తో పాటు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు సత్వరం ధాన్యాన్ని సరఫరా చేసేందుకు సరిపడా వాహనలా ఏర్పాట్లను ముందుగానే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దానికి తోడు వేసవి తీవ్రత ను దృష్టిలో పెట్టుకుని రైతాంగానికి ఎక్కడ ఇబ్బందులు ఎదురు కాకుండా చూడడంతో పాటు ఎండ వేడిమికి వడ దెబ్బ తగలకుండా నివారణ చర్యల నిమిత్తం తక్షణ ఉపశమనం కోసం ఓ.ఆర్.ఎస్ వంటివి ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట పంటకు దిగుబడి రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి పెరుగుతుందని ఖరీఫ్ సీజన్ కు తాజా రబీ సీజన్ కే ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

# 20న రాష్ట్ర బడ్జెట్

సభ నుంచి వాకౌట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందు సభలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అయితే, దీనిపై ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ నిరసన వ్యక్తం చేస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా వాకౌట్ చేశారు. గీతాలాపన ముగిసే వరకు వారు సభలోకి అడుగు పెట్టలేదు. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యేల తీరుపై బీజేపీ శాసనసభాపక్షం నిప్పులు చెరిగింది. సభలో వందేమాతరం పాడుతుంటే గౌరవించకుండా బయటకు వెళ్లడం దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఆ పార్టీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. సభా సంప్రదాయం ప్రకారం సమావేశాల ప్రారంభంలో వందేమాతరం గీతాన్ని ఆలపించడం ఆనవాయితీ అన్నారు. వందేమాతరం వినడానికి ఆసక్తి లేకనా, లేదంటే సదరు సభ్యులకు దేశ భక్తి లేదా? అని ప్రశ్నించారు. వందేమాతరం గీతాన్ని అవమాన పర్చిన సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. అసలు వీరు ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు? వీరు అసలు ఈ దేశ పౌరులేనా?" అని ప్రశ్నించారు. జాతీయ భావాలను గౌరవించలేని వారు ప్రజా ప్రతినిధులుగా కొనసాగే అర్హతను కోల్పోతారని, ఎంఐఎం ఎమ్మెల్యేలు తమ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అసెంబ్లీ లాబీల్లో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరిగింది. ఒకవైపు దేశభక్తి, మరోవైపు తమ సిద్ధాంతాలంటూ ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం సాగింది.

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ..**

శాసనసభ ప్రాంగణంలో.. తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి నిలువెత్తు ప్రతిబింబంగా, అస్తిత్వం, సంస్కృతికి ప్రతిరూపమైన శక్తి స్వరూపిణి “తెలంగాణ తల్లి” విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. సోమవారం శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ముందుగా గవర్నర్, సీఎం, మంత్రులు అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తర్వాత పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సీఎం తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుందని తెలిపారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలన్నారు. ఇది మన ప్రభుత్వం ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై సభ్యులు ఫోకస్ పెట్టాలని, 99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని ఆదేశించారు.

**ఆరు గ్యారంటీల అమలు కోసం బీఆర్ఎస్ ఆందోళన**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం, కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం రైతులను వెన్నుపోటు పొడుస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.తెలంగాణ సంపదను దోచుకుంటూ రాహుల్ గాంధీకి 'వెయ్యి కోట్లు' కప్పం కడుతున్నారంటూ వారు చేసిన నినాదాలు అక్కడ కలకలం రేపాయి. బీఆర్ఎస్ నిరసన నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ పరిసరాల్లో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**రాహుల్ ను తిట్టి పెద్ద లీడర్ అవుదామనే భ్రమంలో కేటీఆర్ : మంత్రి సీతక్క**

రాహుల్ గాంధీని తిడితే కేటీఆర్ పెద్ద లీడర్ అవుతానని అనుకుంటున్నాడు. తనను ఎవరూ గుర్తిస్తలేరనే భయంతోనే కేటీఆర్.. రాహుల్ గాంధీని నిందించడం అలవాటుగా మార్చుకున్నాడు. తాను గ్రేట్ లీడర్ అవుతానని కేటీఆర్ పగటి కలలు కంటున్నాడు. మా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఎందుకంత కడుపుమంటా..? రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజా ప్రభుత్వం ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. పథకాల చట్టబద్ధత గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. ఇతరులను విమర్శించే ముందు కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల డ్రగ్స్ దందా గురించి సమాధానం చెప్పాలి. డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ ఆ పార్టీ నేతపై చర్యలు తీసుకోకపోవడమే వారి చిత్తశుద్ధికి నిదర్శనం వాళ్ల వారసత్వాన్ని వాళ్ల నేతలు ఫామ్‌హౌస్‌లలో కొనసాగిస్తున్నారు తప్ప ప్రజల్లో కాదు. కేంద్రంలోని బీజేపీ వైఫల్యాల మీద మాట్లాడాలంటే కేటీఆర్‌కు వణుకు పుడుతుంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాడు. తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలకు కేరాఫ్‌గా ఉండే మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. ఆయన త్వరలో పార్టీ మారబోతున్నారని, ఆయన కుటుంబ సభ్యులు రాజకీయ భవిష్యత్తు కోసం ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటువంటి నేపథ్యంలో తాజాగా మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఇవాళ అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు నా వయసు 73 ఏళ్లు. ఏ నిర్ణయం తీసుకోవాలో నాకు బాగా తెలుసు. మునిగిపోయే పడవలో ఎవరైనా చేరుతారా? కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదన్నారు. రేవంత్ రెడ్డి 11 ఏళ్ళు కాదు 50 ఏళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నా.. అది మునిగిపోయే పడవనే అంటూ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఎవరు బలంగా ఉన్నారో అందరికీ తెలుసని, మొన్ననే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నా పెళ్ళిరోజు వేడుకలకు ఆహ్వానించినట్టు చెప్పారు.

**కరీంనగర్ లో దళిత కవాతు : ఎమ్మెల్యే మందుల సామేల్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ నన్ను టార్గెట్ చేస్తే కరీంనగర్‌లో దళిత కవాతు పెడతా. ఇటీవల జరిగిన టీపీసీసీ ఎస్సీసెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో నేను బ్రాహ్మణులను ఉద్దేశించి ఎలాంటి తప్పుడు ఆరోపణలు, వారిని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తమకు భాష అర్థం కాదు అనే భావనతోనే మాట్లాడా. కానీ కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నేను మాట్లాడిన భాష బ్రాహ్మణుల ఉద్దేశించి కాదు. నేను గోదావరి పుష్కరాలకు వెళ్లి స్నానం చేసేవాడిని

**ప్రజాప్రతినిధులూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి : కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

డ్రగ్స్ మూలాలు సినిమా ఇండస్ట్రీలోనే ఎక్కువగా ఉన్నాయి. కేవలం సినీ ఆర్టిస్టులే కాకుండా, ప్రజాప్రతినిధులు కూడా ప్రతి 90 రోజులకు ఒకసారి తప్పనిసరిగా డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి. సినీ నటీనటులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకున్న తర్వాతే వారి సినిమాలు విడుదల కావాలి. ఒకవేళ టెస్ట్‌లకు నిరాకరించిన పక్షంలో సినిమాల విడుదలను వెంటనే నిలిపివేయాలి. డ్రగ్స్ టెస్టుల విషయంలో రాజకీయ నాయకులు మినహాయింపు కోరకూడదు. ఒకవేళ పొలిటీషియన్స్ టెస్ట్ చేయించుకోవడానికి నిరాకరిస్తే.. వారిపై పలు అనుమానాలు తలెత్తుతాయి. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోని ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి కూడా అనుమతించకూడదన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహాకు చేదు అనుభవం ఎదురైంది. శాసన మండలి కొత్త భవనంలోకి వెళ్తున్న మంత్రిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇది సీఎం వెళ్లే దారి అని మీరు వేరే వైపు నుండి వెళ్లాలని మంత్రికి సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో ఎలా వెళ్లాలి? నేను మినిస్టర్‌ను నన్ను ఆపుతావా అంటూ సెక్యూరిటీ సిబ్బందిపై దామోదర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలి లోపలికి వెళ్లారు. మినిస్టర్‌తో పాటు ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ మండలి లోపలికి వెళ్లారు.

**తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైంది. ప్రస్తుతం బీజేపీ యే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. శాసనసభలో రేవంత్ సర్కారుపై పోరాటంలో బీఆర్ఎస్ వెనుకబడింది. బీజేపీయే ప్రజల పక్షాన నిలబడుతుంది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలు, రైతు భరోసా ఎగ్గొట్టిన అంశం, ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. గుజరాత్ లో సబర్మతి నది అభివృద్ధికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తే.. తెలంగాణలో మూసీ పునరుద్ధరణ పేరుతో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చుతున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

**సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు : బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**

మూసీ ప్రాజెక్టు సంబంధించి ఏడీబీ లోన్ అంశంపై సభను తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుపై చర్చకు అసెంబ్లీలో ప్రైవేటు బిల్లు పెడతాం. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ మంజూరు చేసిందని సీఎం సభలో చెప్పారు. కానీ తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి డీపీఆర్ రాలేదని, లోన్ మంజూరు చేయలేదని ఆ బ్యాంకు స్టేట్‌మెంట్ ఇచ్చింది. డ్రగ్స్ కేసుతో కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదు. డ్రగ్స్ సంస్కృతికి బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకం. బీఆర్ఎస్ సభ్యులం అందరం గులాబీ టీ–షర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్తున్నాం. దమ్ముంటే తాము పార్టీ మారలేదని చెబుతున్న ఎమ్మెల్యేలందరూ అక్కడి రావాలన్నారు.

**హామీలపై నిలదీస్తాం : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్**

శాసనసభ సమావేశాలకు ముందు ఆనవాయితీగా ఎవరి త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందో వారి స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ, వారి త్యాగాలకు మరొక్కసారి ప్రణమిల్లుతూ మా పార్టీ శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం తెలంగాణ అమరవీరులకు, విద్యార్థి అమరవీరులకు నివాళులర్పించి శాసనసభ సమావేశాలకు హాజరు కాబోతున్నాం. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ కూడా రాష్ట్ర ప్రభుత్వంలోకి వచ్చిన మరుక్షణమే మొదటి క్యాబినెట్ లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికీ రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇంతవరకు చట్టబద్ధత కల్పించలేకపోవడం దారుణం. రెండున్నరేండ్లలో ఇది మూడో గవర్నర్ ప్రసంగం. అయినా ఇంతవరకు ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత లేదు. బీఆర్ఎస్ పాలనలో పంటలు నాట్లు వేసేటప్పుడు రైతుబంధు పడేది. కానీ నేడు పంటలు కోతలకు వచ్చినా రైతుబంధు దిక్కులేదు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక స్పష్టత, ఒక సమాధానం లేదు. అందుకే 'రాహుల్ బంధు కాదు, రైతుబంధు వేయండి', 'రాహుల్ కు రూ.వెయ్యి కోట్లు, రైతులకు వెన్నుపోట్లా' అని చెప్పి ఈ సభా సమావేశాల్లోనే బడ్జెట్ సమావేశంలో తప్పకుండా నిలదీస్తాం. అన్ని వర్గాలకు హామీలిచ్చి మోసం చేసిన ప్రభుత్వం ఇది. బలహీన వర్గాలకు రూ. లక్ష కోట్ల బడ్జెట్. మూడో బడ్జెట్లో ఇప్పటికే రూ. 60 వేల కోట్లు పెట్టి ఉండాలి ఇంతవరకు దానిమీద కూడా స్పష్టత లేదు. దళితబంధు స్థానంలో, ఎస్సీ ఎస్టీలకు అంబేద్కర్ అభయహస్తం ప్రవేశపెడతామన్నారు. 12 లక్షలు ఇస్తామన్నారు ఇంతవరకు అదీ అతీగతీ లేదు. రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదు. ఇతర వర్గాలకు 10 వేల ఉద్యోగాలు ఇచ్చిన పరిస్థితి లేదు. ఇలా ఆరు గ్యారెంటీలకు అయితే మంగళం పాడినట్టే కనబడుతున్నది. రూ. 4 వేల పెన్షన్ల కోసం లబ్ధిదారులు. రైతు భరోసా, రైతుబంధు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ అన్ని విషయాల్లో... ఉద్యోగ జాబ్ క్యాలెండర్ అన్నారు, ఇంతవరకు ఆ క్యాలెండర్ లో మరి కొత్త క్యాలెండర్ ఉందే తప్ప జాబ్స్ అయితే కనబడట్లేదు. ఈ అన్ని విషయాల్లో ప్రభుత్వాన్ని శాసనసభ సమావేశాల్లో నిలదీస్తామన్నారు.

# జాతీయం-అంతర్జాతీయం

## దుబాయ్‌కి ఎయిర్ ఇండియా విమానాలు బంద్



మొదటి పేజీ తరువాయి

కాగా, విమానాశ్రయం సమీపంలో డ్రోన్ సంబంధిత సంఘటన తర్వాత దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రయాణికులు, సిబ్బంది భద్రతను కాపాడేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ సస్పెన్షన్ విధించింది. ప్రయాణీకులు, సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి ముందు జాగ్రత్త చర్యగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటించింది. ప్రయాణికులు తమ విమానాలకు సంబంధించిన తాజా అప్‌డేట్‌ల కోసం వారి సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించింది. మరిన్ని అప్‌డేట్‌లు అందుబాటులోకి వచ్చిన వెంటనే అధికారిక ఛానెల్‌ల ద్వారా ప్రకటిస్తామని అని దుబాయ్ మీడియా కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్ట్ చేసింది. విమానాశ్రయం సమీపంలో డ్రోన్ ఢీకొన్న తర్వాత మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. నష్టం తక్కువగా నమోదైంది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో డ్రోన్ సంబంధిత సంఘటన ఫలితంగా సంభవించిన అగ్నిప్రమాదానికి అధికారులు ప్రస్తుతం స్పందిస్తున్నారు. ప్రతి ఒక్కరి భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అని దుబాయ్ మీడియా కార్యాలయం తెలిపింది.

## ఎల్‌పిజితో భారత్ చేరుకున్న శివాలిక్ నౌక




**న్యూఢిల్లీ, మార్చి 16 (వుదయం):**

పెర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరి హొర్మూజ్ జలసంధిని దాటిన ఎల్‌పిజి కారియర్ శివాలిక్ సోమవారం సాయంత్రం భారత్‌కు చేరుకుంది. సరుకు విడుదలలో ఎటువంటి జాప్యం జరగకుండా చూసుకోవడానికి ఓడరేవులో డాక్యుమెంటేషన్, ప్రాధాన్యతా బెర్తింగ్ సహా ఇతర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసినట్టు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారి రాజేష్‌కుమార్ సిన్హా తెలిపారు.. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ నావికులు సురక్షితంగా ఉన్నారని, గత 24 గంటల్లో ఎటువంటి సంఘటన జరగలేదని సిన్హా అన్నారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రతి నౌక, దాని సిబ్బందితో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకారం, ముందుగా నివేదించినట్లుగా, 611 మంది భారతీయ నావికులతో కూడిన 22 భారతీయ జెండాలు కలిగిన నౌకలు ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని హొర్మూజ్ జలసంధికి పశ్చిమాన పనిచేస్తున్నాయి.

**ఉత్పత్తి పెరిగింది, సరఫరా నియంత్రణలో ఉంది**

అధికారుల ప్రకారం, దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది, ప్రస్తుత ఉత్పత్తి మార్చి 5న నమోదైన స్థాయిల కంటే దాదాపు 36 శాతం ఎక్కువ. పెర్షియన్ గల్ఫ్‌తో అనుసంధానించిన ప్రపంచ షిప్పింగ్ మార్గాలను నిశితంగా గమనిస్తూనే దేశంలో తగినంత సరఫరాను నిర్వహించడం ఈ పెరుగుదల లక్ష్యం. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎల్‌పిజి లభ్యత గురించి తక్షణ ఆందోళన లేదని అధికారులు తెలిపారు. ఎందుకంటే దేశీయ ఉత్పత్తి, ఇన్‌కమింగ్ షిప్‌మెంట్‌లు రెండూ సమన్వయంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

**శివాలిక్ కోసం ప్రాధాన్యతా బెర్తింగ్ ఏర్పాటు**

ఎల్‌పిజిని మోసుకు వస్తున్న శివాలిక్, నందా దేవి మార్చి 13న హొర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం వైపు సరుకుతో ప్రయాణిస్తున్నాయని ప్రభుత్వం ధృవీకరించింది. అవి ఓడరేవుకు చేరుకున్న తర్వాత ఎటువంటి ఆలస్యం జరగకుండా డాక్యుమెంటేషన్తో, ధాన్యతా బెర్టింగ్‌తో సహా సన్నాహాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం పని చేస్తున్న 22 భారతీయ నౌకల గురించి, అధికారిక నిర్ధారణ తర్వాత మాత్రమే వివరణాత్మక సమాచారాన్ని పంచుకుంటామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలోని నౌకలతో సంప్రదింపులు కొనసాగిస్తుందని, అధికారిక సమాచారం అందిన వెంటనే అప్‌డేట్‌లను జారీ చేస్తామని తెలిపారు.

## ఒప్పందానికి ఇరాన్ సిద్ధంగా లేదు



**వుదయం డెస్క్, మార్చి 16 :**

పశ్చిమాసియాలో యుద్ధం మూడవ వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో, యునైటెడ్ స్టేట్స్ ఇరాన్‌తో చర్చలను నిర్వహిస్తోందని, కానీ సంఘర్షణను ముగించేందుకు ఏ ఒప్పందానికి రావడానికీ తెహ్రాన్ ఇష్టపడడం లేదని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నట్టు ఎఎఫ్‌పి వార్తా సంస్థ పేర్కొంది. ఎయిర్ ఫోర్స్ వన్‌పై ఉన్న విలేకరులతో మాట్లాడుతూ, అవును మేం వారితో చర్చిస్తున్నాం అన్నారు. అయితే, ఆ చర్చల స్వభావం గురించిన వివరాలను ఆయన ఇవ్వలేదు. మధ్యప్రాచ్య ప్రాంతమంతా వ్యాపించిన యుద్ధాన్ని ముగించేందుకు దౌత్యపరమైన కృషి పురోగతి ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు రాశారు. కానీ వారు సిద్ధంగా ఉన్నారని తాను అనుకోవడం లేదని ట్రంప్ అన్నారు. కానీ, అందుకు చాలా సమీపంలో ఉన్నారని ఆయన తెలిపారు. కాగా, అమెరికాతో ఎటువంటి చర్చలూ జరగడం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అంతకు ముందు ఖండించారు. వారి నాయకులలో అధికులు మరణించారు. యుద్ధాన్ని ముగించడానికి ఒక ఒప్పందం కుదుర్చుకోవాలనే విషయంలో తనకు సందేహం ఉందని ట్రంప్ సూచించారు, ఎందుకంటే మొదటగా మీరు ఎవరితో వ్యవహరిస్తున్నారో ఎవరికీ తెలియదు, ఎందుకంటే వారి నాయకత్వంలో ఎక్కువ మంది మరణించారు అని ఆయన అన్నారు. అమెరికాఇజ్రాయెల్ దాడుల మొదటి రోజైన ఫిబ్రవరి 28న, ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ, డజన్ల కొద్దీ సీనియర్ ఇరాన్ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, వారు ఒప్పందం కుదుర్చుకోవాలని తీవ్రంగా ఆరాటపడుతున్నారు అని ట్రంప్ నొక్కి చెప్పారు. ట్రంప్ వైఖరిని తిరస్కరిస్తూ, అమెరికాతో చర్చలు జరపడానికి తెహ్రాన్ఆ సక్తి చూపడం లేదని అరాఘ్చి అన్నారు. మేము స్థిరంగా, తగినంత బలంగా ఉన్నాం. మేము మా ప్రజలను మాత్రమే కాపాడుకుంటున్నాం అని అరాఘ్చి ఆదివారం ప్రసారమైన సిబిఎస్ ఛానెల్‌లో ఫేస్ ది నేషన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. అమెరికన్లతో ఎందుకు మాట్లాడాలో మాకు ఎటువంటి కారణం కనిపించడం లేదు, ఎందుకంటే వారు మాపై దాడి చేయాలని నిర్ణయించుకున్నప్పుడు మేం వారితో మాట్లాడుతున్నాం. అమెరికన్లతో మాట్లాడటం మంచి అనుభవం కాదు అని అరాఘ్చి ఎత్తి చూపారు. తప్పుడు సమాచార ఆయుధంగా ఎఐ ఇంతలో, ఇరాన్ తన యుద్ధకాల విజయాలను, సహాయాన్ని తప్పుగా సూచించడానికి కృత్రిమ మేధస్సును తప్పుడు సమాచార ఆయుధంగా ఉపయోగిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఎఐ చాలా ప్రమాదకరమైనది, మనం దానితో చాలా జాగ్రత్తగా ఉండాలి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలోనే పాశ్చాత్య మీడియా ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని విమర్శించారు.

## యుద్ధం యాధాతథం



మొదటి పేజీ తరువాయి

అధికారులు అరెస్టు చేసిన 35 మందిలో పంతొమ్మిది మంది భారతీయులు ఉన్నారు. ప్రజలలో అశాంతిని రెచ్చగొట్టడానికి, మొత్తం స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశించిన కల్పిత సమాచారం, కృత్రిమ కంటెంట్ వ్యాప్తిని ఆపడం లక్ష్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై కఠినమైన పర్యవేక్షణ తర్వాత ఈ చర్య తీసుకున్నట్లు యుఎఇ అటార్నీ జనరల్ డాక్టర్ హమద్ సైఫ్ అల్ షంసీ ఒక ప్రకటనలో తెలిపారు.

**యుఎఇ ఓడరేవులను దాడులకు అమెరికా ఉపయోగించుకుంటోంది - ఇరాన్ ఆరోపణ**

ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి టెర్మినల్ ఉన్న ఖర్గ్ ద్వీపంపై దాడులు చేయడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఓడరేవులు, రేవులు, రహస్య స్థావరాలను అమెరికా ఉపయోగించిందని తెహ్రాన్ ఆరోపించింది. కాగా, తన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలను ఇరాన్ చూపలేదు. దేశానికి తనను తాను రక్షించుకునే హక్కు ఉందని, కానీ ఇప్పటికీ హేతుబద్ధత, తర్కానికి ప్రాధాన్యత ఇస్తూ, సంయమనం పాటిస్తూనే ఉన్నామనియునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడి దౌత్య సలహాదారు అన్వర్ గార్గాష్‌సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

**పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు**

ఇస్లామిక్ రిపబ్లిక్‌లోని చమురు కేంద్రాలపై దాడి చేస్తే ఈ ప్రాంతంలోని అమెరికాకు సంబంధించిన చమురు, ఆర్థిక,ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేయవచ్చని ఇరాన్ ఉమ్మడి సైనిక కమాండ్ శనివారం మరోసారి హెచ్చరించింది. ఈ ప్రాంతంలో అమెరికా ఉనికిని లక్ష్యంగా చేసుకుని తమ దాడులు జరుగుతున్నాయని ఇరాన్ తెలిపింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇతర గల్ఫ్ దేశాలు, ఇరాక్, జోర్డాన్, టర్కీలతో పాటు, అమెరికా సైనిక కేంద్రాలు కూడా ఉన్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని పౌర ప్రాంతాలపై కూడా డ్రోన్లు లేదా క్షిపణులను ప్రయోగించారు. వీటిలో దుబాయ్ విమానాశ్రయం, ప్రసిద్ధ హోటళ్ళు, దేశ ఆర్థిక జిల్లా ఉన్నాయి.

**గల్ఫ్ తో సంబంధాలపై ఇరాన్ 'తీవ్రమైన సమీక్ష' కోరుకుంటోంది: రాయబారి**

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం తర్వాత గల్ఫ్ దేశాలతో ఇరాన్ సంబంధాలపై తీవ్ర సమీక్ష అవసరమని సౌదీ అరేబియాలోని ఆ దేశ రాయబారి ఆదివారం రాయిటర్స్‌తో మాట్లాడుతూ అన్నారు. ఈ ప్రాంతంలో బయటి శక్తుల ప్రభావాన్ని పరిమితం చేయాలని, తద్వారా అది శ్రేయస్సు వైపు పయనించవచ్చని అన్నారు. యుద్ధం సంబంధాలను దెబ్బతీస్తుందని ఆందోళన చెందుతున్నారా అని అడిగినప్పుడు, ఇది సరైన ప్రశ్న, సమాధానం సరళం. మేం పొరుగువారం,పరస్పరాధారితాలం; కనుక, తమ సంబంధాల మధ్య తీవ్రమైన సమీక్ష అవసరం అని ఆయన అన్నారు. అడిగిన ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానంగా, గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంత పరిస్థితి ఈ ప్రాంతంలోని మినహాయింపు విధానం, బాహ్య శక్తులపై అధికంగా ఆధారపడటం ద్వారా రూపుదిద్దుకుందని ఆయన అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో మినహాయింపు విధానాన్ని అవలంబించడం, బాహ్య శక్తులపై అధికంగా ఆధారపడటం ఫలితంగా ఏర్పడిందని ఆయన అన్నారు, ఇరాక్,ఇరాన్‌లతో పాటు గల్ఫ్ సహకార మండలిలోని ఆరు సభ్య దేశాల మధ్య సన్నిహిత సంబంధాలకు పిలుపునిచ్చారు.

**సౌదీలో, యుఎఇలో కొనసాగుతున్న దాడులు**

2020లో ఇరాన్ ప్రధాన ప్రాంతీయ ప్రత్యర్థి ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీకరించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈ దాడుల తీవ్ర ప్రభావాన్ని చవిచూసింది. అయితే, ప్రతి గల్ఫ్ అరబ్ దేశం దాని ప్రభావాలను అనుభవించడమే కాదు అందరూ ఇరాన్‌ను విమర్శించారు. బహిరంగ ప్రకటనలకు దూరంగా, విశ్లేషకులు, ప్రాంతీయ వర్గాలు మాత్రం, యునైటెడ్ స్టేట్స్ పట్ల నిరాశ పెరుగుతోందని, ఆ దేశం చాలా కాలంగా వారి భద్రతా హామీదారుగా వ్యవహరిస్తోంది, కానీ ఇప్పుడు తాము మద్దతు ఇవ్వని యుద్ధంలోకి వాషింగ్టన్ తమను లాగిందని, ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లిస్తున్నారని వారు అంటున్నారు. సౌదీ అరేబియాలో, దాడులు ప్రధానంగా తూర్పు ప్రాంతాన్ని తాకాయి, ఇక్కడే ఆ దేశ చమురు ఉత్పత్తి ఎక్కువగా జరుగుతుంది. సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనల ప్రకారం, రియాద్‌కు తూర్పున యుఎస్ దళాలకు ఆతిథ్యం ఇచ్చే ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్, సౌదీ రాజధాని పశ్చిమ వైపున ఉన్న దౌత్య కార్యాలయాలు, నివాసాలను కూడా లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ప్రాంత వ్యాప్తంగా ప్రత్యర్థి రాజకీయ, సైనిక సమూహాలకు రెండు వైపులా మద్దతు ఇచ్చిన సంవత్సరాల శత్రుత్వం తర్వాత సౌదీ అరేబియా, ఇరాన్ 2023లో పూర్తి దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకున్నాయి.

## రాజ్యసభ ఎన్నిక నిర్వహణ తీరూ, తెన్నూ



**న్యూఢిల్లీ, మార్చి 16 (వుదయం) :**

సోమవారం 10 రాష్ట్రాలలో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో గందరగోళం, అక్రమాల ఆరోపణలు, కొంతమంది శాసనసభ్యులు అందుబాటులో లేరని ఆరోపణలు. రొటీన్ ప్రక్రియ వంటి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం 37 స్థానాలలో 26మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన 11 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో బీహార్ నుంచి ఐదు స్థానాలకు, ఒడిశా నుంచి నాలుగు, హర్యానా నుంచి రెండు స్థానాలకు ఓటింగ్ జరిగింది. ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో, శరద్ పవార్, అభిషేక్ సింఘ్వి, తిరుచ్చి శివ, వినోద్ తావ్డే ఉన్నారు. ఎగువ సభలో, సభ్యులను రాష్ట్ర అసెంబ్లీల ఎమ్మెల్యేలు దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారా ఒకే బదిలీ ఓటు ద్వారా బహిరంగ బ్యాలెట్ ద్వారా ఎన్నుకుంటారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల ద్వారా అన్ని సీట్లు భర్తీ కాకపోతే, గెలిచిన అభ్యర్థుల మిగులు ఓట్లు అవసరమైన సంఖ్య కంటే తక్కువగా ఉన్న ఇతర అభ్యర్థులకు బదిలీ చేస్తారు. అయినప్పటికీ అభ్యర్థి అవసరమైన 41ఓట్ల మార్కును చేరుకోవడంలో సహాయపడకపోతే, రెండవ ప్రాధాన్యత ఓట్లు అమలులోకి వస్తాయి.

**నేఉడు రాజ్య సభ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న కీలక పరిణామాలు**

బీహార్‌లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక రాష్ట్రీయ జనతాదళ్ ఎమ్మెల్యే హాజరుకాకపోవడం రాష్ట్రంలో ఎగువ సభకు పోటీ చేస్తున్న ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని నిర్ధారించే అవకాశం ఉంది. బిజెపి, జెడియులో ఉన్న పలువురు ఎన్డీయే నాయకులు ఇప్పటికే ఎన్నికల్లోక్లీన్‌స్వీప్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఒడిశాలో ప్రతిపక్ష బిజు జనతా దళ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు



స్వతంత్ర నామినీ దిలీప్ రేకు ఓటు వేశారు. ఇతడికి బిజెపి మద్దతు ఉందని పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది. ఒక బిజెపి ఎమ్మెల్యేకు రెండవ బాలెట్ పత్రాన్ని జారీ చేశారనే దానిపై వివాదం చెలరేగడంతో ఒడిశాలో నాలుగు రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నిక అరగంటపాటు ఆగిపోయింది. బిజెపి ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రకు రెండవ బాలెట్ పత్రాన్ని ఇవ్వడం పట్ల బిజెడి ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, మహాపాత్ర తనకు ముందు ఇచ్చిన పత్రంపై ఓవర్ రైటింగ్ జరిగడం వల్లే రెండవది కోరినట్టు పేర్కొన్నారు. ఇలా ఉండగా, ఎన్నికలకు ముందుగా క్రాస్ ఓటింగ్ జరుగుతుందన్న భయంతో తమ పార్టీకి చెందిన హర్యానా ఎమ్మెల్యేలను కాంగ్రెస్ కౌశాలికి తరలించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధిపతి రావ్ నరేందర్ సింగ్‌తో కలిసి వారు అక్కడికి వెళ్లారు. సోమవారం ఉదయం వారికి చండీగఢ్‌కు తిరిగి వచ్చినట్టు పిటిఐ తెలిపింది. బిజెపి హార్స్ ట్రేడింగ్ చేస్తోందని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజెడి నాయకుడు నవీన్ పట్నాయక్ ఆరోపించారు. గత కొన్ని రోజులుగా బిజెపి, వారి మిత్రపక్షాల గురించి చర్చించినట్లుగా, వారు ఎమ్మెల్యేలను అనైతికంగా తమవైపు తిప్పుకుంటారనే విషయం సుస్పష్టం. వారు తమ కోసం పని చేయడానికి చాలా మందిని సేకరించారు. వారిలో చాలా మందికి నేర చరిత్ర ఉందని చెప్పడానికి నేను సిగ్గుపడుతున్నాను, అని పట్నాయక్ మీడియాతో అన్నారు,

## ఇరాన్ పొరుగుదేశాల నుంచి బయటపడిన భారతీయులు

**న్యూఢిల్లీ, మార్చి 16 (వుదయం) :**






ఇరాన్‌లో నివసిస్తున్న వందలాదిమంది భారతీయులు ఇరాన్ పొరుగుదేశాల నుంచి బయటపడ్డారని భారత ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. యుఎస్, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధ నేపథ్యంలో అట్టుడుకుతున్న పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య అధికారులు ఈ ప్రాంతంలోని పౌరులకు అధికారులు సహాయం అందిస్తున్నందున, వందలాది మంది భారత జాతీయులు పొరుగు దేశాల ద్వారా ఇరాన్ నుండి బయలుదేరారని తెలిపింది. భారతీయులను సురక్షితమైన ప్రదేశాలకు తరలించడంలో, వారు తిరిగి రావడానికి వీలు కల్పించడంలో భారత మిషన్లు చురుకుగా నిమగ్నమై ఉన్నాయని ఎంఇఎ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. 550 మంది భారతీయులు ఇరాన్ నుంచి భూ సరిహద్దు ద్వారా అర్మేనియాలోకి ప్రవేశించారని, 90 మంది భారతీయులు అజర్‌బైజాన్‌కు వెళ్లారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అంతర్‌మంత్రిత్వ శాఖ సమావేశం సందర్భంగా తెలిపారు. 284 మంది భారతీయులు తీర్థయాత్ర కోసం ఇరాన్‌కు వెళ్లారని ఆయన అన్నారు. వారిలో కొందరు ఇప్పటికే భారతదేశానికి తిరిగి వచ్చారని, మరికొందరు రాబోయే కొద్ది రోజుల్లో తిరిగి వస్తారని భావిస్తున్నట్టు తెలిపారు.

**తెహ్రాన్ నుండి బయలుదేరిన విద్యార్థులు**

తెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం పూర్తి స్థాయిలో పనిచేస్తుందని, క్షేత్రస్థాయిలో సహాయాన్ని సమన్వయం చేస్తోందని ప్రభుత్వం తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఇరాన్ రాజధానిలోని భారతీయ విద్యార్థులను తెహ్రాన్ వెలుపల ఉన్న సురక్షిత నగరాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, ఈ ప్రాంతంలోని భారతీయ పౌరులకు సహాయం చేయడానికి హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాలలోని భారతీయులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతున్నామని, చిక్కుకుపోయిన పౌరులు, సందర్శకులకు మద్దతు ఇవ్వడానికి స్థానిక అధికారులతో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

**గల్ఫ్ దేశాల నుంచి నడుస్తున్న విమానాలు**

సోమవారం ఒక్క రోజే, యుఎఇ, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్ సహా భారతదేశానికి వెళ్లేందుకు 45 విమానాలను ప్లాన్ చేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఫిబ్రవరి 28 నుండి సుమారు 2,20,000 మంది భారతీయులు తిరిగి వచ్చారని ప్రభుత్వం తెలిపింది. ఖతార్ వైమానిక ప్రాంతం పాక్షికంగా తిరిగి తెరిచినందున అక్కడి నుండి విమానాలు నడుస్తున్నాయి, నేడు, రేపు భారతదేశంలోని వివిధ గమ్యస్థానాలకు మూడు విమానాలు నడుస్తాయని ఆయన తెలిపారు. అయితే, కువైట్ గగనతలాన్ని మూసివేశారు. త్వరలో ప్రత్యేక నాన్‌షెడ్యూల్ విమానాలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. బహ్రెయిన్, ఇరాక్‌లోని ప్రయాణికులకు, సౌదీ అరేబియా ద్వారా రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఒమన్‌లోని సోహార్‌లో ఇద్దరు భారతీయులు మరణించారని ప్రభుత్వం కూడా ధృవీకరించింది. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం బాధితుల కుటుంబాలతో, ఒమానీ అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని, మృతదేహాలను త్వరలో తిరిగి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

## అసెంబ్లీ ఎన్నికలకు ముందు బెంగాల్‌లో బ్యూరోక్రసీ ప్రక్షాళన

**కోల్‌కత, మార్చి 16 (వుదయం) :**




త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అందరికీ సమాన అవకాశం ఉండేలా చూసేందుకు, భారత ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా భారీ పరిపాలనా, భద్రతా ప్రక్షాళనను అమలు చేసింది. ఎన్నికల సన్నద్ధతపై ఉన్నత స్థాయి సమీక్ష తర్వాత, రాష్ట్ర కార్యనిర్వాహక, పోలీసు విభాగాలను సమర్థవంతంగా కమిషన్ పునర్నిర్మించింది. రెండు దశల ఎన్నికల సమయంలో తటస్థ అధికారులను బలోపేతం చేయడం లక్ష్యంగా ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) సోపానక్రమంలో అత్యంత కీలక మార్పులు జరిగాయి. అజయ్ కుమార్ నంద్ (ఐపీఎస్, 1996 బ్యాచ్) కోల్‌కతా పోలీస్ కొత్త కమిషనర్‌గా నియమితులయ్యారు. కీలకమైన సమయంలో ఆయన నగర భద్రతా యంత్రాంగానికి నాయకత్వం వహిస్తున్నారు. ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇన్‌చార్జ్) పదవిలో ఉన్న సిద్ధ్ నాథ్ గుప్తా (ఐపీఎస్, 1992 బ్యాచ్) పశ్చిమ బెంగాల్ డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందారు. అజయ్ ముకుంద్ రనడే (ఐపీఎస్, 1995 బ్యాచ్) రాష్ట్రంలోని అస్థిర జిల్లాలలో శాంతిభద్రతలను కాపాడే బాధ్యతను నిర్వహిస్తారు. ఆయనను అదనపు డైరెక్టర్ జనరల్, లా అండ్ ఆర్డర్ ఐజీగా నియమితులయ్యారు. నటరాజన్ రమేష్ బాబు (ఐపీఎస్, 1991 బ్యాచ్) ఇప్పుడు కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తారు. పోలీసు బలగాలతో పాటు, రాష్ట్ర పౌర పరిపాలనలో అగ్రశ్రేణి ఇద్దరు అధికారులు ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శిని ఇసిఐ భర్తీ చేసింది. దుష్యంత్ నారియాలా (ఐఎఎస్, 1993 బ్యాచ్) అధికారికంగా నందిని చక్రవర్తి స్థానంలో రాష్ట్ర అత్యున్నత స్థాయి అధికారిగా నియమితులయ్యారు. సంఘమిత్ర ఘోష్ (ఐఎఎస్, 1997 బ్యాచ్) హోం, పర్వతప్రాంత వ్యవహారాల ప్రిన్సిపల్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు, ఆ బాధ్యతలలో ఉన్న జగదీష్ ప్రసాద్ మీనాను కమిషన్ తొలగించింది. కమిషన్ ఆదేశాలు కఠినమైన, చర్చించలేని టైంలైన్‌తో వచ్చాయి. కొత్తగా నియమితులైన అధికారులందరూ వెంటనే తమ పదవులను చేపట్టాల్సి ఉంది, మార్చి 16, సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలలోపు కంప్లయెన్స్ నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియను సంభావ్య పక్షపాతం నుంచి రక్షించడానికి, ఈ పునర్వ్యవస్థీకరణలో బదిలీ చేసిన ఏ అధికారీ 2026 ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసే వరకు ఎన్నికలకు సంబంధించిన ఏ పదవిలోనూ ఉండకూడదని ఇసిఐ తీర్మానించింది. ఈ పాలనా భూకంపం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు దశల షెడ్యూల్‌ను ఇసిఐ ప్రకటించిన తర్వాత సంభవించింది, మొదటి దశ ఏప్రిల్ 23న, రెండవ దశ ఏప్రిల్ 29న జరుగనున్నాయి.

**IN THE COURT OF THE V- JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**OS.NO.641 OF 2026**

**Between:**
1. **Mrs.Sunkara Kanaka Durga Rani,**
W/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad,
A/o. 65 years, R/o. 8-4-300/3 and 3/1,
Flat No.3502, Vasavi Brindavanam, Fathe Nagar.
Erragadda, Sanathnagar,
Hyderabad Telangana-500018.
2. **Mrs. Sunkara Suneetha,**
D/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad,
A/o. 46 years, R/o. 2-140, Plot No.16 &17,
Bhavani Residency, Chinna Avutapalli,Gannavaram Mandal, Chinna Avutapalli,
Krishna District, Andhra Pradesh-521286.
Also presently residing at,
22325 Valencia Dr, Little Elm Texas - 75068
3. **Mrs. Sunkara Sowmini,**
D/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad,
A/o. 45 years, R/o. 8-3-677/33 Sri Krishnadevaraya Nagar, HDFC Bank ATM, Yellareddyguda,
Hyderabad, Telangana - 500073
4. **Mrs. Kolasani Mallika,**
D/o Late Mr. Sunakara Siva Rama Krishna Prasad,
A/o.43 Years, R/o. 8-4-300/3, Tower-3, F.No-3604,
Vasavi Brindavanam,
Hyderabad, Telangana-500018.
**...Plaintiffs**

**AND**

**1.The Tehsildar,**
**Khairthabad Mandal,**
**Hyderabad District.**
**2. ALL CONCERNED**
**...Defendant**

To
The above named Plaintiffs have filed the above Original Suit bearing O.S.No.641OF 2026 on the file of the HON'BLE COURT OF THE IV-JUNIOR CIVIL JUDGE , CITY CIVIL COURT, AT HYDERABAD for Declaration of Legal Heirs. Plase take notice that the above O.S is stands posted to 06-04-2026 for your appear in person or through Counsel, the above sut will be heard and determined accordingly.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**ADAPA V SUBBARAYUDU**
**ADAPA LAKSHMIKANTAM, Advocates**
**FINNLEX LAW LLP**
**#403, 4TH Floor, Aalts A&M Trade center,**
**Himayat Nagar Hyderabad-29**
**Ph. No. 9908099555**




“ అప్పటి కోవిడ్ –19 రెండవ దశ దుర్భర పరిస్థితుల్లో 2021 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ను వీలైనన్నీ తక్కువ దశల్లో పూర్తి చేయాలని బిజెపి తప్ప మిగతా అన్ని పార్టీలు కోరుకోగా ఎన్నికల సంఘం బెంగాల్ లో ఎనిమిది దశల్లో పోలింగ్ జరిపించింది. కోవిడ్ కు లక్షలాది మంది ఓటర్లను బలి ఇచ్చే స్థితిని సృష్టించడం సరైనది కాదని మద్రాసు హైకోర్టు మందలించిన ఎన్నికల సంఘం వినిపించుకోలేదు. ఈసారి పోలింగ్ ను ఒకటి రెండు దశల్లో పూర్తి చేయాలని బిజెపి కోరింది. ఇసి అలాగే చేసింది. ఆ విధంగా ఎన్నికల సంఘం ఒక హాస్యాస్పదమైన వ్యవస్థగా తనను తాను దిగజార్చుకున్నది. తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్రంలోని మొత్తం 294 శాసన సభ స్థానాలకూ అభ్యర్థులను ఖరారు చేసింది. వీరి జాబితాను నేడు (మంగళవారం) ప్రకటించే అవకాశం ఉంది. పోలింగ్ ను ఎనిమిది లేక డజను దశల్లో జరిపించినా, రెండు దశలకే కుదించినా మేము మళ్లీ అధికారంలోకి వస్తాం. ”

* కునాల్ ఘోష్, తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## వే'మన'పద్యం

**ఆత్మశుద్ధి లేని యాచారమదియేల?**
**భాండశుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలరా?**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# కీలక ఓటు సమరాలు

నాలుగు రాష్ట్రాలు ఒక కేంద్ర పాలిత ప్రాంత శాసన సభలకు ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కేరళ, అసోమ్, తమిళనాడు రాష్ట్రాలు, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం లో ఒకే రోజులో పోలింగ్ ముగిసిపోనుండగా, ఒక్క పశ్చిమ బెంగాల్ లో మాత్రం రెండు విడతల్లో నిర్వహించనున్నారు. నిత్య వివాదాస్పదుడుగా వార్తలకెక్కుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ఈ సారి పశ్చిమ బెంగాల్ పోలింగ్ ను రెండు విడతల్లోనే జరిపించి దలచడంపై విమర్శలు బయలుదేరాయి. 2021లో దేశాన్ని కోవిడ్ –29 రెండో దశ కర కర నమిలి మింగుతుండగా, ఓటు వేయడానికి లక్షలాది మంది వీధుల్లోకి రావడం వల్ల వారు కరోనాకు దొరికిపోయే ప్రమాదమున్నదని న్యాయ స్థానాలు హెచ్చరిస్తున్నా ఇదే సి ఇ సి బెంగాల్ లో 8 విడతల్లో పోలింగ్ జరిపించారు. ఇప్పుడు రెండు విడతల్లో ముగించివేయాలనుకోవడంలోని ఆంతర్యం ఏమిటనే ప్రశ్నిస్తున్నారు. ఇందులో ఆక్షేపించవలసింది ఏమీ లేదు. సి ఇ సి కేంద్రంలోని బిజెపి పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారారని తృణమూల్ కాంగ్రెస్ సంధించిన విమర్శను తప్పు పట్టలేము. బెంగాల్ లో రాజకీయ హింస ఎక్కువనే కారణపైనే ఎక్కడైనా పోలింగ్ ను వివిధ దశలలో విస్తరించడం జరుగుతున్నది. అలాగే కొండలు, లోయలు ఉండి సుదూర ప్రాంతాలుండే చోట కూడా ఎక్కువ దశల్లో పోలింగ్ జరుపుతారు. అక్కడ 2021 లో కంటే ఇప్పుడు బహు తక్కువ దశల్లో పోలింగ్ ముగించబోతున్నారంటే తృణమూల్ హయాంలో హింస తగ్గిందని అనుకోవాలా? పశ్చిమ బెంగాల్ ను 15 సంవత్సరాలుగా పాలిస్తున్న మమతా బెనర్జీని, ఆమె నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఎలాగైనా గద్దె దింపాలని బిజెపి కంకణం కట్టుకున్నది. చేతికి దొరికిన ఏ చిన్నరాయినీ వదిలి పెట్టడం లేదు. రాష్ట్రపతి సందర్భాన్ని కూడా మమత పై సునిసితంగా ప్రయోగించారు. స్వయంగా ప్రధాని మోడీ గళాస్త్రాన్ని సాధన చేసి సంధిస్తున్నారు. కాని బిజెపి కి రాష్ట్రస్థాయిలో బలమైన నాయకత్వం లేకపోవడం ఒక – /పెద్ద లటు. మతాల మధ్య చిచ్చు ప్రయోగం బెంగాల్ లో అతిగా ఫలించే అవకాశం కనిపించడం లేదు. అయితే బీహార్ అనుభవాలు చూసిన తర్వాత ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (సర్ ) వంటి కొత్త చిట్కాల ఎత్తులతో బిజెపి చెప్పుకోదగిన గెలుపులు సాధించినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇంకా బిజెపి కి బద్ధ వ్యతిరేక రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు ఎన్నికలపై ప్రజలు, పరిశీలకులు దృష్టి కేందకరించడం సహజం. కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వానికి మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. యు డి ఎఫ్ కంటే ఎల్ డి ఎఫ్ విజయావకాశాలే బాగున్నాయంటున్నారు. అదే జరిగితే ఎల్ డి ఎఫ్ ది హాట్ ట్రిక్ అవుతుంది. కేరళలో బోణీ చేసిన బి జె పి కూడా తనకు ప్రీతి పాత్రమైన హిందుత్వ వ్యూహంతో పట్టు సాధించుకోవాలని చూస్తున్నది. అంత కంటే ఎక్కువగా ఎ ఐ ఎ డి ఎం కె కొంగు చాటునుంచి ప్రభావాన్ని చూపడం అలవాటుచేసుకున్న బిజెపి తమిళనాడు లో మారుతున్న రాజకీయ సమీకరణాల ద్వారా లబ్ధి పొందాలని ప్రణాళికలు రచించుకుంటున్నది. అసోమ్ ఇప్పటికే బిజెపి చేతిలో మైనపు ముద్ద ఆయిపోయినట్టు కనిపిస్తున్నది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# చట్టసభల్లో రైతు ప్రాతినిధ్యమేది ?

భారతీయుల ప్రధాన వృత్తి వ్యవసాయం. దేశ జనాభాలో సుమారు 60 % మంది వ్యవసాయం లేదా దాని అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వ పాలనా పరంగా అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న రంగం కూడా అదే. వ్యవసాయాన్ని, రైతుల ఆర్థిక పరిస్థితులను ఒక పరిపూర్ణ ప్రణాళిక ద్వారా మెరుగుపరచకుండా క్షతగాత్రుడికి బ్యాండేజి కట్టు కట్టినట్లు అర కొర పథకాలతో ఎన్నికల్ని దాటేందుకు మాత్రమే ప్రతి ప్రభుత్వం ఆలోచిస్తోంది. రైతులకు అవసరమైన విత్తనాల, ఎరువుల ధరలు పెరగని సంవత్సరం లేదు. నకిలీ మందుల బెడద తీర్చేవారు లేరు. మద్దతు ధర కాగితాలకే పరిమితం. నకిలీ విత్తనాలు, పెస్టిసైడ్స్ అమ్మే, పంటను కొనే వ్యాపారుల చేతుల్లో రైతులు నిండా మునుగుతున్నారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా అమాయక రైతులకు వాటి ప్రయోజనం దక్కడం లేదు. వ్యవసాయం శాఖ నుండి ఎలాంటి శిక్షణ, రక్షణ లేక దిక్కులేని పరిస్థితుల్లో బతుకుతున్నారు. దీనికి ప్రధాన కారణం చట్ట సభల్లో రైతు ప్రతినిధులకు తగిన స్థానం లేకపోవడమే అనుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోంచి వచ్చిన అగ్రవర్ణాల నేతలందరూ తాము రైతులమే అని చెప్పుకుంటారు కానీ వారంతా వందల ఎకరాల భూస్వాములే తప్ప సాగు కష్టనష్టాలను ఎదుర్కొంటున్న రైతులు కాదు. ఇంకా చెప్పాలంటే భూమికి యజమానులై వేలాది కౌలు రైతుల ఉసురు పోసుకుంటున్నవారని కూడా చెప్పవచ్చు. భూమి ఉన్నందుకు రైతుబంధు తీసుకుంటున్నాం, అందులో తనుంచి వచ్చామని చెప్పుకున్నా నాగలి పడుతున్నవారు మాత్రం కాదు. వ్యవసాయిక కుటుంబాల్లోంచి వచ్చిన రాజకీయ నాయకులంతా కాంట్రాక్టుల్లో, రియల్ ఎస్టేటు దందాల్లో, వ్యాపారాల్లో, న్యాయవాద వృత్తిలో స్థిరపడి భారీగా ఆదాయాన్ని పొందుతున్న వారే. వారిని రైతు ప్రతినిధిగా లెక్కించలేము. రైతుల కోసం ఉద్యమాలు చేపట్టేవారు, చట్ట సభల్లో వారి సమస్యలపై గట్టిగా ప్రశ్నించేవారు మాత్రమే రైతు ప్రతినిధులుగా పరిగణింపబడతారు. ఈ రోజుల్లో ఏ పార్టీ తరపున గెలిచినా చట్ట సభల్లో రైతుల పక్షాన గట్టిగా గొంతెత్తేవారు, ప్రభుత్వ నిర్ణయాలను నిలదీసేవారు, నిరసన తెలిపేవారు పూర్తిగా కరువయ్యారు. అందుకే దేశంలో



రైతు బతుకు కేవలం వ్యాపారవేత్తల లాభాలకు బలవుతోంది. పార్టీకి ఆర్థికంగా సాయపడేవారి కోరిక మేరకు బడ్జెట్ తయారు చేయడంతో పాటు, చట్టసభల్లో ఉన్న సభ్యులకు సాగు బాధలు స్వయంగా తెలియకపోవడం వల్ల వారి పట్ల తేలికభావం ఏర్పడింది. పైగా ఉన్నత వర్గాలకు చెందినవారికి శ్రమజీవులపై సానుభూతి ఉండకపోవడంతో పేదల అవసరాల పట్ల వారికి నిరాసక్తి ఉంటుంది.

అందుకే చట్టసభల్లో రైతు కష్టాలను తెలపడానికి అందులో సభ్యులుగా రైతులు లేదా రైతు ఉద్యమనేతలు ఉండాలి. అయితే ఈ రోజుల్లో ఏ పార్టీ వారికి టికెట్ ఇచ్చే ఆలోచనలో లేదు. వారు స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే పరిస్థితులు లేవు. జంప్ జిలానీలకు టికెట్లు సర్దే విషయంలో తలమునకలైన పాలక పార్టీలకు కనీసం ఒకరిద్దరినైనా రైతుల పక్షాన సభలో కూచోబెడదామన్న ఇంగితం లేదు. రాజ్యసభ, విధానమండలి కూడా పార్టీలని మేపేవారితోనే నింపుతున్నారు. పార్టీల మారడం కూడా సంఘసేవ అని చెప్పుకొనే స్థాయిలో మనవాళ్లున్నారు. ప్రస్తుత తెలంగాణ విధాన మండలిలో ఒక్క రైతు ప్రతినిధి కానరాడు. జనాభాలో సగం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం తరపున చట్టసభల్లో కనీసం పది శాతమైనా లేకపోవడం మన దౌర్భాగ్యం.

ఒకప్పుడు రైతుల సమస్యలపై అవగాహన కలవారిని వ్యవసాయ శాఖ మంత్రిగా ఎంపిక చేసేవారు. సుదీర్ఘ రాజకీయ జీవితం గల వడ్డే శోభనాధీశ్వరరావు వ్యవసాయం మంత్రిగా సభలో రైతుల గురించి పక్షపాతం లేకుండా మాట్లాడేవారు. కోనేరు రంగా రావు పేదలకు భూ పంపిణీ విషయంలో ఆనాటి ప్రభుత్వానికి విధివిధానాలు రూపొందించి అందించారు. రైతు నేపథ్యం గల జువ్వాడి చొక్కా రావు తెలంగాణాలో సాగు, తాగు నీటి పారుదల సౌకర్యాలకై ఎంతో కృషి చేశారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కు ఆయన పేరు పెట్టారు. వ్యవసాయ మంత్రిగా పనిచేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యవసాయంలో డాక్టరేట్ చేసి పాఠాలు కూడా చెప్పారు. చట్ట సభ్యుడిగా ఆయన ఎన్నో వ్యవసాయ సంస్కరణల కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. యలమంచిలి శివాజీ రాజ్యసభలో, బయటా రైతు శ్రేయోభిలాషిగా కృషి చేశారు. వ్యవసాయ పద్ధతులపై సాధికారిత గల రైతు నేత ఆయన. గత భారాస హయాంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వ్యవసాయం మంత్రిగా ఉన్నారు. ఆయన వృత్తిరీత్యా అడ్వొకేటు. ప్రస్తుతం తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ వ్యవసాయ శాఖ మాత్యులుగా ఉన్నారు. ఆయన చదువు పూర్తవగానే రాజకీయాల్లో చేరారు. అవసరానుగుణంగా పార్టీల మారుతూ తమ రాజకీయ భవితను రక్షించుకుంటున్నారు. ఇప్పటికైతే రైతుల పట్ల ఆయన నిర్మాణాత్మక అడుగు తీసుకున్నది లేదు.

గత పదేళ్లుగా పార్లమెంట్ లో రైతు నేపథ్య ప్రజా ప్రతినిధుల సంఖ్య తగ్గిపోతోంది. వందకు పైగా గ్రామీణ జీవితాల్లోంచి వచ్చిన సభ్యులు ఉండే లోక్ సభలో ఇప్పుడు కేవలం 38 మాత్రమే వ్యవసాయం కుటుంబాల్లోంచి వచ్చిన వారున్నారు. 40 % సభ్యులు తమ అఫిడవిట్ లో సాగు భూమి కలిగి ఉన్నా అది కేవలం స్థిరాస్తిగానే లెక్కించాలి. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ నికార్సయిన రైతు పక్షపాతి. నెహ్రూ ప్రతిపాదించిన సామూహిక వ్యవసాయ పద్ధతిని ఆయన వ్యతిరేకించి రైతుకు భూమిపై హక్కు ఉండాలని కృషి చేశారు. ఆయన సమాధిని కిసాన్ ఘాట్ అని పిలుస్తారు. ఆయన జన్మదినాన్ని కిసాన్ దివస్ గా ప్రకటించారు. దేవీలాల్, అజిత్ సింగ్ కూడా వ్యవసాయ శాఖా మంత్రులుగా తమ ముద్ర వేశారు. అయితే వీరితో పోల్చదగ్గ నేతలెవరూ ప్రస్తుతం చట్టసభల్లో లేరు. రైతు పక్షాన నిలబడాలని నిబద్ధత పూర్తిగా లోపించింది. ప్రస్తుతం రైతుల సంస్థలపై ఉద్యమిస్తున్న వారెవరూ ఎన్నికల్లో నిలబడి గెలిచే అవకాశం లేదు. వారిని ఏ పార్టీ కూడా తమ అభ్యర్థులు ప్రకటించేందుకు సిద్ధంగా లేవు. యూపీలో రైతుల కరెంటు బిల్లు, నీటి బిల్లు తగ్గించాలని పోరాడిన దివంగత రైతు నాయకుడు మహేంద్ర సింగ్ టికాయత్ రెండు పర్యాయాలు అసెంబ్లీకి పోటీ చేసినా గెలుపు ఆయన్ని వరించలేదు. మూడు వ్యవసాయం చట్టాలను వెనక్కి తీసుకొనేలా కేంద్రం మెడలు వంచిన రైతు నేత రాకేష్ టికాయిత్ 2007 లో అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. ఇలా నేటి ఎన్నికల పర్వంలో రైతు నేతలు నెగ్గుకు రాలేకపోతున్నారు. పార్టీలు నిజమైన రైతు పక్షపాతులకు టికెట్ ఇవ్వకపోవడం మరియు నిలబడ్డ వారిని జనం గెలిపించుకోకపోవడం వల్ల చివరకు రైతుల గురించి చట్టసభల్లో ప్రశ్నించేవారు లేకుండా పోతోంది.



✍ బి.నర్సన్
9440128169

# మమతానురాగాల మాధుర్యం

జీవితం అనేది ఒక అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో మనం ఎన్నో మైలురాళ్లను దాటుతాం, మరెన్నో మలుపులను చూస్తాం. ప్రతి మలుపులోనూ కొత్త అనుభవాలు, సవాళ్లు మనల్ని పలకరిస్తాయి. కొన్నిసార్లు కన్నీళ్లు, మరికొన్నిసార్లు కేరింతలు మనల్ని ఆవరిస్తాయి. అయితే, ఈ భావోద్వేగాల ప్రవాహంలో మానవ ఉనికికి అసలైన రంగును, రుచిని అద్దేవి రెండే రెండు అంశాలు,అవి మమత మరియు అనురాగం. ఈ ఆధునిక యాంత్రిక యుగంలో మనం పరుగుల వెనుక పడుతూ, ప్రాథమికమైన ఈ మానవీయ విలువలని కోల్పోతున్నామా? మమత, అనురాగం లేకుండా జీవితం నిజంగా పూర్తవుతుందా? ఈ ప్రశ్నల చుట్టూ సాగే ఒక ఆత్మీయ విశ్లేషణ ఇది. మమత అంటే ఏమిటి? నిఘంటువుల్లో దీనికి అనేక అర్థాలు ఉండవచ్చు, కానీ హృదయానికి



తెలిసిన అర్థం మాత్రం అమ్మ. మమత అనే మాటకు నిలువెత్తు రూపం తల్లి. తన బిడ్డ తనలో భాగంగా ఉన్నప్పటి నుండి, ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా ఆ బిడ్డ క్షేమం కోసం ఆమె పడే తపనే మమత. అయితే, మమత కేవలం రక్త సంబంధాలకే పరిమితం కాదు. ఇది ఒక విశ్వజనీనమైన భావం. ఒక అపరిచితుడి కష్టాన్ని చూసి మనసు ద్రవించడం, ఆకలితో ఉన్న జీవికి అన్నం పెట్టడం, తోటి మనిషి బాధలో ఉన్నప్పుడు నేనున్నానంటూ భుజం తట్టడం ఇవన్నీ మమత యొక్క వివిధ రూపాలే. మమత లేని సమాజాన్ని ఒక్కసారి ఊహించుకోండి. అది కేవలం రాతి విగ్రహాల సమూహంలా ఉంటుంది. ఒక వ్యక్తి కేవలం తన స్వార్థం, తన అవసరాల గురించి మాత్రమే ఆలోచిస్తే, అక్కడ సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది. మమత అనేది మనుషులను కలిపి ఉంచే ఒక అదృశ్య బంధం. ఇది మనలో కరుణను, సానుభూతిని మేల్కొల్పుతుంది. మమత లేని జీవితం ఒక ఎడారి వంటిది,అక్కడ మనుగడ ఉండవచ్చు కానీ, మనసును తడిపే చల్లని ఊట ఉండదు. మనం సామాజిక జీవులమని చెప్పుకోవడానికి గర్వపడేలా చేసేది మనలో ఉన్న ఈ మమతా భావమే.మమత పునాది అయితే, అనురాగం ఆ పునాదిపై నిర్మించబడిన అందమైన భవనం. అనురాగం అంటే ప్రేమ, అపారమైన అభిమానం. ఇది మమత కంటే కొంచెం వ్యక్తిగతమైనది, గాఢమైనది. మన కుటుంబ సభ్యుల పట్ల, ప్రాణ స్నేహితుల పట్ల, జీవిత భాగస్వామి పట్ల మనం చూపే ప్రత్యేక ఆత్మీయతనే అనురాగం అంటాం. అనురాగం ఉన్న చోట ఆశ ఉంటుంది, ఉత్సాహం ఉంటుంది.చీకటి గదిలో చిన్న దీపం ఎంత వెలుగునిస్తుందో, నిరాశలో ఉన్న మనిషికి ఒకరి అనురాగం అంతటి ధైర్యాన్నిస్తుంది. సూర్యరశ్మి లేనిదే మొక్కలు ఎలా వాడిపోతాయో, అనురాగం కరువైన హృదయం కూడా అలాగే శుష్కించిపోతుంది. అనురాగం మన జీవితానికి ఒక ఉద్దేశ్యాన్ని ఇస్తుంది. మనం ఎవరి కోసం కష్టపడుతున్నాం? మన విజయాన్ని చూసి ఎవరు సంతోషిస్తారు? మన ఓటమిలో ఎవరు తోడుంటారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం మనపై అనురాగం చూపే వ్యక్తులే. అనురాగం మన దైనందిన జీవితంలోని ఒత్తిడిని తుడిచివేసి, గుండెకు హాయినిచ్చే అమృతం లాంటిది.నేటి కాలంలో నేను స్వతంత్రంగా ఉంటాను, నాకు ఎవరితోనూ పని లేదు అని చెప్పుకోవడం ఒక ఫ్యాషన్‌గా మారింది. కానీ ఇది ఒక భ్రమ మాత్రమే. మానవ మనస్తత్వ శాస్త్రం ప్రకారం, మనిషికి సామాజిక బంధాలు ప్రాణవాయువు లాంటివి. ఒంటరితనం అనేది కేవలం ఒంటరిగా ఉండటం కాదు, మన చుట్టూ మనుషులు ఉన్నా మనల్ని అర్థం చేసుకునే వారు, ప్రేమించే వారు లేకపోవడం.పరిశోధనలు ఏం చెబుతున్నాయంటే, ప్రేమ మరియు ఆత్మీయత పొందని వ్యక్తుల్లో రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మరియు తీవ్రమైన మానసిక ఆందోళనలు (Depression) తలెత్తుతున్నాయి. ఒక పసిబిడ్డ తల్లి స్పర్శ కోసం ఎలా తపిస్తుందో, వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తి తన పిల్లల పలకరింపు కోసం అలాగే ఆశగా ఎదురుచూస్తాడు. పుట్టిన క్షణం నుండి మరణించే వరకు మనిషికి మరొక మనిషి తోడు, ప్రేమ కచ్చితంగా అవసరం. భౌతికంగా ఎన్ని సౌకర్యాలు ఉన్నా, మానసికమైన తోడు లేని జీవితం అసంపూర్ణం.జీవితంలోని ప్రతి దశలోనూ ఈ భావాలు మనల్ని నడిపిస్తాయి,చిన్నప్పుడు లభించే ప్రేమే ఒక వ్యక్తి యొక్క ఆత్మవిశ్వాసానికి పునాది. తల్లిదండ్రుల అనురాగంలో పెరిగిన పిల్లలు మానసికంగా దృఢంగా ఉంటారు. ప్రేమ కరువైన బాల్యం నేర ప్రవృత్తికి లేదా తీవ్రమైన ఆత్మన్యూనతా భావానికి దారితీసే ప్రమాదం ఉంది ఈ దశలో స్నేహం, ప్రేమ వంటి అనురాగ బంధాలు అత్యంత కీలకం. ఒక మంచి స్నేహితుడు లేదా ఒక అర్థం చేసుకునే భాగస్వామి జీవిత గమనాన్నే మార్చగలరు. ఈ బంధాలు మనకు సామాజిక బాధ్యతను, పంచుకోవడంలో ఉన్న ఆనందాన్ని నేర్పిస్తాయి. సంపాదన, కుటుంబ బాధ్యతల నడుమ మనిషి నలిగిపోతుంటాడు. అప్పుడు భార్యాపిల్లల మమత అతనికి రీఛార్జ్ లాగా పనిచేస్తుంది. తన కుటుంబం కోసం త్యాగం చేయడంలో ఉండే తృప్తి సాటిలేనిది జీవిత చరమాంకంలో ఆస్తిపాస్తుల కంటే, తమ చేతిని పట్టుకుని మేమున్నాం అని చెప్పే మనవలు, మనవరాళ్ల అనురాగమే గొప్ప సంపద. ప్రేమ లేని వృద్ధాప్యం నరకప్రాయం.డబ్బు ఉంటే అన్ని కొనుక్కోవచ్చు అనే ధీమా చాలామందిలో ఉంటుంది. నిజమే, డబ్బుతో విలాసవంతమైన కారును కొనవచ్చు, కానీ ఆ కారులో పక్కన కూర్చుని మన ముచ్చట్లు వినే ఆత్మీయుడిని కొనలేము. ఖరీదైన పరుపును కొనవచ్చు, కానీ కంటినిండా నిద్రను ఇచ్చే ప్రశాంతతను కొనలేము. ప్రపంచంలోని అత్యంత ధనవంతులైన వ్యక్తులు కూడా ఒక్కోసారి ఒంటరితనంతో కుమిలిపోతుంటారు.

ఒక సందర్భంలో ఒక కోటీశ్వరుడు ఇలా అన్నాడు .నా దగ్గర ప్రపంచంలోని అన్ని ఖరీదైన వస్తువులు ఉన్నాయి. కానీ నేను అనారోగ్యంతో ఉన్నప్పుడు నా నుదుటిపై చేయి వేసి బాగున్నావా అని అడిగే స్వచ్ఛమైన ప్రేమ కోసం నా కోట్లు ఇచ్చేయడానికైనా సిద్ధమే. దీన్ని బట్టి అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, విజయానికి ఇచ్చే నిర్వచనంలో ప్రేమ కూడా ఒక భాగం కావాలి. కేవలం అంకెల్లో పెరిగే బ్యాంక్ బ్యాలెన్స్ జీవితం కాదు.మమతానురాగాలు అనేవి ఏకపక్షంగా ఉండేవి కావు. ఇది ఒక నిరంతర ప్రవాహం. మనం ఎంత ప్రేమను ఇస్తామో, అంతే ప్రేమను తిరిగి పొందుతాం. కేవలం ఇతరుల నుండి ప్రేమను ఆశించి, మనం మాత్రం కఠినంగా ఉంటే ఆ బంధం నిలవదు. అలాగే, మనం కేవలం ఇస్తూ ఉండి, తిరిగి కనీస గుర్తింపును పొందలేకపోతే మనసు విసిగిపోతుంది. అందుకే, ఈ బంధంలో సమతుల్యత అవసరం. అవతలి వ్యక్తి భావాలను గౌరవించడం, వారి కష్టాల్లో తోడుండటం ద్వారానే అనురాగం చిగురిస్తుంది.మన భారతీయ సంస్కృతిలో వసుధైక కుటుంబకం అనే భావన ఉంది. అంటే ప్రపంచమంతా ఒకే కుటుంబం అని అర్థం. సర్వ జీవుల పట్ల దయ కలిగి ఉండటమే పరమార్థం అని మన పురాణాలు చెబుతున్నాయి. రామాయణంలో రాముడి పట్ల లక్ష్మణుడికి ఉన్న అనురాగం, భాగవతంలో కృష్ణార్జునుల స్నేహం ఇవన్నీ మమతానురాగాల గొప్పతనాన్ని చాటిచెప్పేవే.ప్రతి మతం కూడా ప్రేమనే బోధించింది. బుద్ధుడి కరుణ, క్రీస్తు ప్రేమ సందేశం, సూఫీ సన్యాసుల మానవతావాదం ఇవన్నీ మనిషిని మనిషిగా ప్రేమించమని చెబుతున్నాయి. ఆధ్యాత్మికంగా ఎదగడం అంటే మనలోని అహంకారాన్ని చంపుకుని, అందరినీ ప్రేమించడమే. ఎక్కడైతే ద్వేషం నశించి ప్రేమ మొలకెత్తుతుందో, అక్కడ స్వర్గం ఉంటుంది.దురదృష్టవశాత్తు, నేడు టెక్నాలజీ పెరిగేకొద్దీ మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వందల కొద్దీ లైకులు వస్తున్నాయి కానీ, కళ్ళలోకి చూసి మాట్లాడే ధైర్యం, ఓపిక తగ్గిపోతున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఫోన్లలో చాటింగ్ చేసుకునే స్థితికి మనం చేరుకున్నాం. భోజనం టేబుల్ మీద కబుర్లు మాయమై, నోటిఫికేషన్ల శబ్దాలు ఎక్కువయ్యాయి.ఈ యాంత్రిక జీవనం మనల్ని రోబోలుగా మారుస్తోంది. మనం ప్రేమను వ్యక్తపరచడం మరచిపోతున్నాం. ఒక చిన్న చిరునవ్వుతో పలకరించడం, ఫోన్ పక్కన పెట్టి ఎదుటివారి బాధను వినడం వంటి చిన్న చిన్న పనులు చేయలేకపోతున్నాం. ఈ పరిస్థితి మారాలి. బంధాలకు డిజిటల్ స్పర్శ కంటే హృదయ స్పర్శ అవసరం. చివరగా, మమత మరియు అనురాగం లేని జీవితం కేవలం ఒక శ్వాసించే శరీరం మాత్రమే. అది ఒక అసంపూర్ణ కావ్యం. మనం ఎన్ని గొప్ప కార్యాలు చేసినా, ఎన్ని శిఖరాలను అధిరోహించినా, వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మనల్ని ప్రేమగా హత్తుకునే ఒక జత చేతులు లేకపోతే ఆ గెలుపుకు విలువే లేదు. జీవితం మలిసంధ్యలో మనకు మిగిలేవి మనం సంపాదించిన ఆస్తులు కాదు, మనం పంచిన ప్రేమ మరియు మనం పొందిన ఆత్మీయతలు మాత్రమే. ఒక చిన్న మొక్కకు నీరు ఎలాగో, మనిషి మనుగడకు మమతానురాగాలు అలాగ. అందుకే, మన బిజీ జీవితాల్లో కొంచెం సమయాన్ని కేటాయించి మన ప్రియమైన వారిని కౌగిలించుకుందాం, స్నేహితులతో మనసు విప్పి మాట్లాడుదాం, అపరిచితుల పట్ల దయతో మెలుగుదాం.మమతానురాగాలు లేని జీవితం పూర్తవుతుందా? అనే ప్రశ్నకు సమాధానం ఖచ్చితంగా లేదు. ఎందుకంటే, ప్రేమ లేని చోట దైవం ఉండదు, దైవం లేని చోట జీవనం పరిపూర్ణం కాదు. ప్రేమిద్దాం. ప్రేమించబడదాం. ఈ ప్రపంచాన్ని మరిన్ని మమతానురాగాలతో నింపేద్దాం.



✍ డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

# వినియోగదారుల హక్కులు

వ్యాపార వాణిజ్యాలకు కేంద్ర బిందువు ఏకైక వినియోగదారుడు మాత్రమే. వినియోగదారులకు స్పష్టమైన హక్కులు, బాధ్యతలు ఉంటాయి. అనైతిక అన్యాయమైనా వస్తు సేవలు, అక్రమ వ్యాపార పద్ధతులతో వినియోగదారుడు నష్టపోవడంతో అనాదిగా కొనసాగుతున్నది. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, సమస్యల పట్ల తొలిసారి 15 మార్చి 1962న అమెరికాలో నాటి అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడికి కొన్ని స్పష్టమైన హక్కులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఉపన్యాసాన్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచ మానవాళి ప్రతి ఏట హక్కుల పరిరక్షణ చట్టాల ద్వారా భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక హక్కు, అభిప్రాయాలను వినిపించే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు లాంటివి కల్పించబడినవి. కల్తీలు, చీకటి వ్యాపారాలు వినియోగదారులకు శాపాలుగా మారుతున్నాయి. భారత్‌లో 24 డిసెంబర్‌న “జాతీయ వినియోగదారుల దినం” జరుపుకోవడం జరుగుతోంది. వినియోగదారులకు అన్యాయాలకు, వస్తు సేవల లోపాలకు గురైనపుడు కోర్టులను లేదా ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందడమే కాకుండా అక్రమ వ్యాపారులకు శిక్షలు పడడానికి కూడా వెసు



15 మార్చిన “ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం (వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే)”ను పాచించుట 1983 నుంచి ఆనవాయితీగా మారింది. వినియోగదారుల హక్కుల ప్రాధాన్యం, నిజాయితీగా వ్యాపార పద్ధతులు పాటించడం, వినియోగదారుల చట్టాల పరిజ్ఞానం, వస్తు నాణ్యత – సేవలు, వ్యాపార ఆచరణలు, సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారులు మారడం, వినియోగదారుల రక్షణ చర్యలు లాంటి అంశా లను ప్రచారం చేయడానికి ఈ వేదికలను వినియోగించుకోవడం గత నాలు గు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నది.

### సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారుల మారడం

2025 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం – 2026 ఇతివృత్తంగా “సురక్షిత ఉత్పత్తులు, నమ్మకంతో కూడిన వినియోగదారులు” అనే అంశాన్ని తీసుకొని ఆరోగ్యకర జీవనశైలి వైపు వినియోగదారుల దృష్టి కోణం మారడం, అందరికీ అందుబాటులోకి తేవడం లాంటివి జరగాలి. భారత వినియోగదారుల లుబాటు కల్పించారు. వస్తు విలువలను బట్టి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కోర్టుల్లో పరిష్కారాలు అందుతున్నాయి. వినియోగదారులు హక్కులను అనుభవిస్తూనే తమ బాధ్యతలను కూ డా మరువకుండా చట్టాలను గౌర విస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయా లి. వినియోగదారుల విద్య పట్ల అవగాహన పెంచుకొని నైతిక విలువలతో ప్రవర్తిస్తూ వ్యాపారుల అనైతిక చర్యల కు స్పందిస్తూ ముందుకు సాగాలి. వ్యాపార సంస్థలు, వినియోగదారుల మధ్య సద్భావనలు, నమ్మకాలు, నీతి నిజాయితీలు, జవాబుదారీతనం లాం టి అంశాల్లో సరైన సంబంధాలు కలిగి ఉండాలి.



మధుసూదన్ రెడ్డి
9949700037



# గ్రేటర్ హైదరాబాద్



## జీ తెలుగు మేఘసందేశంలో నారద మహర్షిగా మెరిసిన రమేష్



షాద్ నగర్, మార్చి 16 (ఉదయం): ప్రముఖ రంగస్థల నటులు మరియు శ్రీ కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు వడ్ల రమేష్ (రమేష్ విశ్వకర్మ) బుల్లితెరపై తన ప్రతిభను చాటుకున్నారు. ప్రముఖ ఎంటర్టైన్మెంట్ ఛానల్ 'జీ తెలుగు'లో ప్రసారమయ్యే 'మేఘసందేశం' డైలీ సీరియల్‌లో ఆయన నారద మహర్షి పాత్రలో నటించారు. ఈ రోజు ప్రసారమయ్యే ఎపిసోడ్‌లో ఒక ముఖ్యమైన సన్నివేశంలో ఆయన నారదునిగా కనిపించనున్నారు. ఇప్పటికే పద్య నాటకాల్లో దుర్యోధన, రావణ, భస్మాసుర వంటి వైవిధ్యమైన పాత్రలు పోషించి గుర్తింపు పొందిన రమేష్, ఇప్పుడు బుల్లితెరపై నారద పాత్రలో కనిపించడం పట్ల కళాకారులు మరియు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.."సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇలాంటి మంచి సీరియల్స్‌లో నటించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. కళాకారులను ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### డిప్యూటీ కలెక్టర్ సుమలత



మేడ్చల్ \ మల్కాజిగిరి, మార్చి 16 (ఉదయం ప్రతినిధి ): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమలత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల (125) దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ సుమలతతో కలిసి జిల్లా అధికారుల స్వీకరించారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుజాత, ఎఫ్ జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రమణమూర్తి, డిఆర్డిఎ సాంబ శివ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## గ్యారంటీలకు చట్ట బద్ధత కల్పించాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్




కుత్బుల్లాపూర్, మార్చి 16 (ఉదయం ప్రతినిధి ): బడ్జెట్ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించకుండా గవర్నర్ నోటి వెంట అవాస్తవాలు చెప్పించడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సభను వాకౌట్ చేశారు. అనంతరం ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అమర వీరుల స్తూపం వద్ద బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ తో పాటుగా ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర



అమీన్‌పూర్, మార్చి 16 (ఉదయం): అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, గ్రామ ప్రజలందరూ స్వామి కృపతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం గ్రామ పెద్దలు, భక్తులు కలిసి కాట శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సన్మానించారు.

## జిఎంఆర్ మాతృమూర్తిని పరామర్శించిన హరీష్ రావు



పటాన్చెరు, మార్చి 16 (ఉదయం): గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారి మాతృమూర్తి శ్రీమతి గూడెం మాణెమ్మ గారిని సోమవారం ఉదయం రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారు పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. హరీష్ రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి గారు , నర్సాపూర్ ఎమ్మెల్యే శ్రీమతి సునీత లక్ష్మారెడ్డి గారు పరామర్శించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు వారి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.

## జిహెచ్ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

### పారిశుద్ధ్యం ,అభివృద్ధి పనులపై కమిషనర్ క్షేత్రస్థాయిలో సమీక్ష





హైదరాబాద్, 16 మార్చి (ఉదయం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ఉదయం గోషామహల్, కార్వాన్ సర్కిళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భగత్ సింగ్ జంక్షన్ వద్ద కొనసాగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడి ఇందిరమ్మ కాంటీన్‌ను తనిఖీ చేసి, పరిసర ప్రాంతాల్లోని రోడ్లు, రహదారులపై తక్షణమే ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు.

పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తున్న ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై కమిషనర్ సమీక్షించారు. అక్కడి కేర్‌టేకర్ వద్ద సిబ్బంది హాజరును పరిశీలించి, మరుగుదొడ్లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, ఏసీ (సానిటేషన్) రవికిరణ్, ఇంజినీరింగ్ మరియు శానిటేషన్ విభాగాల అధికారులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులతో కలిసి సమీప రహదారులు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు (జీవీపీలు) కాలినడకన పరిశీలించారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ఆ భవనాన్ని ఉగాది సందర్భంగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ తర్వాత కమిషనర్ జియాగూడ 100ఫీట్ రోడ్డును పరిశీలించారు. శానిటేషన్, రహదారి నిర్వహణ పనుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. అభివృద్ధి పనులను మరింత వేగం చేయాలని అధికారులకు కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. తనిఖీల్లో జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, డీఈఈలు, ఏఈలు మరియు కర్వాన్ సర్కిల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలగమల్ల ఆనందకు సన్మానం



రంగారెడ్డి, మార్చి 16 (ఉదయం): రంగారెడ్డి జిల్లా, అమన్ గల్ మండలం, చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన 'జల వనిత' శ్రీమతి తెలగమల్ల ఆనంద, 'జల్ జీవన్ మిషన్' అమలులో ఆమె చేసిన కృషికి గాను ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 'జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం 2026'లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారు మరియు కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి శ్రీ సి.ఆర్. పాటిల్ వంటి ప్రముఖులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం కోసం తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం 3 మంది మహిళా సర్పంచులు, 3 మంది 'జల వనితలు' మరియు 3 మంది స్వయం సహాయక బృందాల మహిళలు ఎంపికయ్యారు. ఎంపికైన ఆ ప్రతినిధులలో శ్రీమతి తెలగమల్ల ఆనంద ఒకరు. జల్ జీవన్ మిషన్ అమలులో ఆమె చేసిన విశేష కృషిని గుర్తించి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గారు 16.03.2026న కొంగరకలాన్‌లోని ఐడిఓసి లో శ్రీమతి తెలగమల్ల ఆనందను ఘనంగా సన్మానించారు.

## ప్రజావాణికి 52 ఫిర్యాదులు



రంగారెడ్డి, మార్చి 16 (ఉదయం): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధికప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు సమస్యల పరిష్కారం నిమిత్తం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ- 23, ఇతర శాఖలకు - 29, మొత్తం 52 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### క్యూర్ ప్రజలకు జీహెచ్ఎంసీ కమిషనర్ పిలుపు



హైదరాబాద్, 16 మార్చి (ఉదయం): ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీతో పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. మార్చి 31 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) స్కీమ్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్యూర్ ఏరియాలో 28 లక్షల 8 వేల ఆస్తి పన్నుదారుల్లో 16 లక్షల 80 వేల మంది చెల్లించారని చెప్పారు.

సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ప్రాపర్టీ టాక్స్ ఓ టి ఎస్ స్కీం వివరాలు వెల్లడించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, రెవెన్యూ అదనపు కమిషనర్ ప్రియాంక అల, సానిటేషన్ అదనపు కమిషనర్ రవి కిరణ్, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. క్యూర్ ఏరియా పరిధి జీహెచ్ఎంసీ,ఎంఎంసి ,సిఎంసిలో గత ఆర్థిక సంవత్సరం ఇదే రోజు నాటికి ఆస్తి పన్ను వసూళ్లు 1984 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నేటి వరకూ రూ.2,186 కోట్ల పన్ను వసూలైందన్నారు. పన్ను చెల్లింపుల్లో పారదర్శకత, జవాబుదారితరాన్ని పెంపొందించేందుకు ఆన్లైన్ విధానంలో ప్రాపర్టీ టాక్స్ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మీ సేవ,www.ghmc.gov.in పోర్టల్, సిటిజన్ సర్వీస్ సెంటర్, మై క్యూర్ లలో ఆస్తి పన్ను దీర్ఘకాలికంగా చెల్లించని వారి పై జిహెచ్ఎంసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుతో పాటు అసెస్మెంట్ , కరెక్షన్ సహా అనేక సేవలు మై క్యూర్ అప్లికేషన్ లో అందుబాటులో ఉంటాయన్నారు.సాంకేతికత దన్నుగా జిహెచ్ఎంసి పరిధిలో సుపరిపాలన అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కర్ణన్ సందర్భంగా తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం లో భాగంగా కార్యక్రమం ప్రారంభమైన ఈ నెల 6 నుంచి 16 వ తేదీ వరకూ జీహెచ్ఎంసీ పరిధిలోని 6 జోన్లు, 30 సర్కిల్ కార్యాలయాలు, 150 వార్డుల పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయాల క్లీనింగ్, ఫైల్స్ క్లియరెన్స్,జివిపి ల మ్యాపింగ్ , ఎలిమినేషన్ చర్యలు, సి అండ్ డి వేస్ట్ తొలగింపు, ప్యాబ్స్, రూబ్స్, అండర్ పాస్ లు, ఫ్లై ఓవర్ లు, ఫైర్ సేఫ్టీ, ఈ వేస్ట్ మెగా డ్రైవ్, ప్రజా మరుగుదొడ్ల క్లీనింగ్, నిర్వహణ పై ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టామని చెప్పారు.

## గవర్నర్ ప్రసంగంపై విమర్శలు



చేవెళ్ల, మార్చి 16 (ఉదయం) : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగంపై తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టి అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం మొత్తం వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందని పాండురంగారెడ్డి విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, రైతుల కష్టాలపై స్పష్టమైన చర్యలు కనిపించలేదన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించదని ఆయన అన్నారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మకు ప్రతీక అని, ఆ సంస్కృతిని పక్కన పెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో తమకు స్థానం లేదనే భావనతో కొందరు ఆ చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నారని పాండురంగారెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు.


## 14వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమం




చేవెళ్ల,మార్చి16 (ఉదయం) : చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని సోమవారం 14వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు.పరిశుభ్రమైన పరిసరాలు మన అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి తెలిపారు. కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డులో చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు.అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యకరమైన జీవితానికి మూలాధారమని అన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా తడిపొడి చెత్తను వేరు చేసి చెత్తబండిలో వేయాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రజా పాలనలో ప్రధాన లక్ష్యం రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు, మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్, అశోక్, నాయకులు మద్దెల జంగయ్య, గజ్జెల యాదయ్య, బాలకృష్ణ, అధికారులు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలి

అమీన్పూర్ ,మార్చి 16(ఉదయం): మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## చేవెళ్లలో ఇఫ్తార్ విందు

### ముస్లిం సోదరులకు రంజాన్ కిట్ల పంపిణీ




చేవెళ్ల, మార్చి16 (ఉదయం): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని సోమవారం అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొని, వారికి పవిత్రమైన రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రగతి పాలనలో శుభ్రత పనులు

### ప్రజలు పరిశుభ్రతకు సహకరించాలని కౌన్సిలర్ ప్రశాంత్ పిలుపు





చేవెళ్ల, మార్చి 16 (ఉదయం) : "99 రోజుల ప్రగతి పాలన" కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతపూర్ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బండ్లగూడెం ప్రశాంత్ ఆధ్వర్యంలో చేపట్టారు.గ్రామం నుంచి ప్రధాన గేట్ వరకు రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే గ్రామంలోని ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడానికి చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బండ్లగూడెం ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఇలాంటి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కేశవరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, వడ్ల పాండు బట్టిగూడెం నరసింహారెడ్డి శ్యామ్ పట్లోళ్ల శేఖర్ రెడ్డి పట్లలో సాయికుమార్ రెడ్డి మల్లారెడ్డి, బట్టిగూడెం లక్ష్మారెడ్డి, కొలంపు లక్ష్మారెడ్డి పట్లలో విష్ణువర్ధన్ రెడ్డి కుమ్మరి కుమార్ మినపల్లి వెంకటేష్ పట్లోళ్ల ఉపేందర్ రెడ్డి అడ్వకేట్ చాకలి నరసింహులు కావాలి రాములు బక్కనోళ్ళ కృష్ణ మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొని కౌన్సిలర్ బండ్లగూడెం ప్రశాంత్ చేపట్టిన శుభ్రత కార్యక్రమాన్ని అభినందించారు.

## లీప్ స్పేస్ పై గీతంలో శిక్షణ

### పాల్గొన్న ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ



పటాన్చెరు, మార్చి 16 (ఉదయం): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని విజ్ఞాన వనరుల కేంద్రం (కే.ఆర్.సీ. లేదా గ్రంథాలయం) ఆధ్వర్యంలో సైన్స్ డైరెక్ట్ ఏఐ సాధనం, లీప్ స్పేస్ పై ఒకరోజు ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరిశోధకుల పండిత సాహిత్యాన్ని మరింత సమర్థవంతంగా కనుగొని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకురాలిగా వ్యవహరించారు. అధునాతన సాహిత్య ఆవిష్కరణ, పరిశోధన అంతర్దృష్టులు, విద్యా సహకారం కోసం సైన్స్ డైరెక్టర్ ఏఐ ఆధారిత ప్లాట్ ఫామ్ లీప్ స్పేస్ ను ఉపయోగించడంపై ఆమె ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు.

ఇందులో భాగంగా, లోతైన పరిశోధన అంతర్దృష్టులను రూపొందించడానికి స్కోపస్ డేటా, సైన్స్ డైరెక్టర్ పూర్తిటెక్స్ట్ వనరులను ఈ సాధనం ఎలా ప్రభావితం చేస్తుందో ఆమె వివరించారు. అంశాలను అన్వేషించడం, నిపుణులను కనుగొనడం, నిధుల లభ్యత వంటి కీలక అంశాలు ఈ శిక్షణలో ఉన్నాయి. ఇవి పరిశోధకులు వర్ధమాన పరిశోధనా రంగాలను అన్వేషించడానికి, అలాగే సహకార, నిధుల అవకాశాలను గుర్తించడానికి వీలు కల్పిస్తాయి.

అంశాల అన్వేషణలో భాగంగా, సాలిడ్‌స్టేట్ బ్యాటరీ టెక్నాలజీలో పరిణామాలు, మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్ ల ప్రభావం చుట్టూ తలెత్తుతున్న ప్రశ్నలు, సీఆర్ఐఎస్పీఆర్ జన్యు సవరణలో ఇటీవలి పురోగతులు, చర్చలు వంటి ప్రస్తుత పరిశోధనాంశాలను ఆమె వివరించారు. జనరేటివ్ ఏఐ భద్రత, పీఎఫ్ఏఎస్ కాలుష్యం, నివారణ, అలాగే భారీ భాషా నమూనాల (ఎల్ఎల్ఎం) మూల్యాంకన పరిశోధన వంటి రంగాలలో అగ్రశ్రేణి రచయితలు, పరిశోధకులను గుర్తించడంపై శివాలికా మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయంలో ప్రారంభ దశ పీఎఫ్ఏఎస్ పరిశోధనకు మద్దతు ఇచ్చే సంభావ్య గ్రాంట్లను, మైక్రో ప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యంపై అధ్యయనాలు, ఓపెన్ సైన్స్, పరిశోధన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే చొరవలను గుర్తించడంలో పరిశోధకులకు సహాయపడే 'ఫైండ్ ఫండింగ్ ఫీచర్'ను కూడా ఆమె వివరించారు.తొలుత, గీతం చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు ఎల్స్ వియర్ ఎలా మద్దతు ఇస్తోందీ ఆ సంస్థకు చెందిన ప్రణవ్ శుక్లా వివరించారు. గీతంలోని వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కే.ఆర్.సీ. డైరెక్టర్ ఎస్.పి.ఏ. బాలసుబ్రమణియన్, ఉప గ్రంథపాలకుడు కె. రామకృష్ణల పర్యవేక్షణలో ఈ ఆచరణాత్మక ఆన్ లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, సహాయ గ్రంథపాలకుడు కె. దుర్గాప్రసాద్ సమన్వయం చేశారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

16 మార్చ్ 2026 నిర్మల్ (వుదయం ప్రతినిధి ):

దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. భారత జనాభా గణన 2027 కి సంబంధించి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. అధికారులు చేపట్టే జనగణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పనలో జనగణన ప్రక్రియ ఆధారం అని అన్నారు. దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, గృహాల గుర్తింపు, జనగణన వివరాల



నమోదులో తప్పులకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందించే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. జనగణన ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించి, విజయవంతం చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు అధికారులకు జనగణనకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారెంటీల అమలులో వైఫల్యంపై బీజేపీ విమర్శలు



**రెండున్నర ఏళ్లయిన 6 గ్యారంటీలను అమలు చేయలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**

కరీంనగర్, మార్చి 16 (వుదయం ప్రతినిధి):

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మించి నిలువునా మోసం చేసిందని , కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు ఆన్ గ్యారంటీగా మారాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర ఘాటుగా విమర్శించారు. బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లయిన 6 గ్యారంటీలను అమలు చేయలేని దౌర్భాగ్య పరిస్థితిల్లో ఉందన్నారు. నాడు అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి నేడు ఇచ్చిన వాగ్దానాలు, హామీల పై దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఒక ఫ్రీ బస్సును కల్పించి మహిళలకు ప్రతి నెల రూ. 2500 , రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ను ఎగ్గొట్టిందన్నారు' రైతు భరోసా" కు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా అందించడానికి అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. రైతు కూలీల రైతు భరోసా కు మంగళం పాడిందన్నారు. ప్రధానంగా ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలోరూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ప్రకటించి రూ.12 వేలకు కుదింపు చేసి రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు.యువ వికాస పథకాన్ని గాలికి వదిలేసిందన్నారు.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇంటర్నేషనల్ స్కూల్స్ ల ఏర్పాటు పత్తా లేకుండాపోయిందన్నారు.చేయూత " పథకానికి కాంగ్రెస్ సర్కార్ చేయించిందని, పెన్షన్లను పెంచుతామని పెన్షన్ దారులను తీవ్రంగా మోసం చేసిందన్నారు.రూ. 4000 పెన్షన్ ఇవ్వడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలం ఉన్నవారికి 5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కిచ్చిందన్నారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే స్కీంను తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకుందన్నారు. ఆరుగ్యారంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని , రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా 6 గారంటీలను సక్రమంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 6 గ్యారంటీల అమలు కోసం బీజేపీ ప్రజల కు అండగా నిలుస్తుందని, ఎలాంటి పోరాటానికైనాసిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఆరూ గ్యారెంటీ ల అమలు చేసేదాకా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లా నాయకులు చింతం శ్రీనివాస్, బూట్ల శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణ్ , పాశం రాఘవరెడ్డి, బోనాల మోహన్, ఓ బి సి మోర్చా మండల అధ్యక్షులు దురిశెట్టి రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎలుక పెల్లి స్వామి, మండల జనరల్ సెక్రెటరీ గొట్టుముక్కల తిరుపతిరెడ్డి. సీనియర్ నాయకులు వేల్పుల ఓదెలు, పబ్బతి రుపతి, సత్తయ్య కుమార్, హరిక్రిష్ణ కమెరా వెంకటేష్ ,అజయ్, ఈశ్వర చారి జాడి రాజు, రాఘవ రెడ్డి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## త్యాగానికి, సమర్పణ భావనకు నిదర్శనమే పొట్టి శ్రీరాములు

### ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు

కామారెడ్డి, మార్చి 16 (వుదయం):-

త్యాగానికి సమర్పణ భావనకు నిదర్శనమే పొట్టి శ్రీరాములు అని, తెలుగు జాతి ఐక్యత కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టి ప్రాణత్యాగం చేయడం తెలుగు జాతి పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్యవైశ్య జాతిలో జన్మించి తెలుగుజాతి ప్రజల కోసం ఆత్మ బలిదానం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయిన వ్యక్తియే పొట్టి శ్రీరాములు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆర్యవైశ్యులందరూ ఐక్యమత్యంతో సమాజం కోసం ముందుకు వెళ్లాలని అన్నారు. ఆర్థికంగా వైశ్య సమాజం ముందంజలో ఉన్న రాజకీయంగా సమాజంలో వెనుకబడి ఉండడం జరిగిందని ఆ వెనకబాటు పోవాలంటే



ఆర్యవైశ్యులు ఐక్యత ఎంతో ముఖ్యమని అన్నారు. వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకన్న, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్, సుదర్శన్, కోశాధికారి నంగునూరి కాశీనాథం, జిల్లా ఉపాధ్యక్షులు కొత్త బీమ్ రాజ్ మందుల రామచంద్రం, కోపూరీ భూమేష్, పార్శి కృష్ణమూర్తి, సోమిశెట్టి ఆంజనేయులు, ఐవిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరన... జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 57**

జగిత్యాల మార్చి 16 (వుదయం ప్రతినిధి):

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ అధికారులను అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను ఆర్డీఓ లతో కలిసి స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి



చొరవ చూపాలని అన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా తేదీ 16 3 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 57 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో లు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తహసీల్దార్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 142 దరఖాస్తుల రాక

### అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, మార్చి 16 (వుదయం ప్రతినిధి):

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, 142 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖకు 56, డీఆర్డీఓకు - 20, జిల్లా పంచాయతీ కార్యాలయం 14, గృహ నిర్మాణ శాఖకు 13, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 7, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కమిషనర్ కు మూడు చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారి, జిల్లా వైద్యాధికారి, మైనింగ్ శాఖ అధికారి, ఎక్సైజ్ అధికారి, సెస్ ఎండీకి రెండు చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర ఆలయం, ఈఈ ఆర్ అండ్ బీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సబ్ రిజిస్టర్ ఆఫ్ సిరిసిల్ల, ఎస్పీ కార్యాలయం కు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు.ప్రజావాణిలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు ఆయా శాఖల తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన పెద్దపల్లి ఆర్డీవో**

పెద్దపల్లి, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తో పాటు పాలనాధికారి బి. ప్రకాష్ కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ పట్టణం చెందిన గెల్లు కేతమ్మ వృధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తెలిపారు.అంతర్గం గ్రామానికి చెందిన కొంకటి స్వరూప గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం కుట్టించే టెండర్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు



చేసుకోగా జిల్లా విద్యా శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని తెలిపారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సుమన్ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి పన్ను లు చెల్లించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బృంద ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి గంగయ్య తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తల సేమియా బాధితులకు అండగా పిసిఆర్ ఫౌండేషన్

జన్నారం, మార్చ్ 16(వుదయం విలేకరి):

పీసిఆర్ ఫౌండేషన్ స్థాపించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా తల సేమియా బాధితుల కోసం సోమవారం జన్నారం మండల కేంద్రంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సుమారు 50 మంది దాతల నుండి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఎంతోమంది అనాథలకు, చిన్నారులకు, అండగా నిల్చామని అలాగే మునుముందు పలు సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కిష్టాపూర్



సర్పంచ్ వాసాల నరేష్,పొనకల్ పాక్స్ మాజీ చైర్మన్ అల్లం రవి, పొనకల్ ఉప సర్పంచ్ జలపతి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, నాయకులు ఫజాల్ ఖాన్, మున్వర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు ముత్యం రాజన్న, రజాక్, బిజెపి నాయకులు గోలి చందు, సందవేణి పవన్, ఎం ఆర్ పీ ఎస్ మండల అధ్యక్షులు ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

16 మార్చ్ 2026 నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి):

రైతులు జిల్లాలో కూరగాయల పంటల సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని తన చాంబర్లో సోమవారం పలువురు రైతులకు, ఉచిత ఐదు రకాల కూరగాయల విత్తనాలు గల కిట్ లను అందించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతులు కూరగాయల సాగును పెంచేలా కృషి చేయాలని అన్నారు. ఐదు రకాల కూరగాయల విత్తనాలు గల కిట్ ల ద్వారా రైతులకు మేలు కలుగుతుందని అన్నారు. ఈ విత్తనాల ద్వారా



నాణ్యమైన కూరగాయలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. రైతులందరూ ఈ విత్తనాలను సాగు చేసేలా దృష్టి సారించాలని సూచించారు. ఉద్యానవన పంటల అధికారుల మండలాలలో ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయబడతాయని వివరించారు. ఈ విత్తనాలు అర ఎకరంలో సాగు చేయడానికి సరిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ విద్యా బోధనకు నిలయాలుగా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలు

- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ మార్చి 16 (వుదయం ప్రతినిధి):

అత్యుత్తమ విద్యా బోధనకు కేరాఫ్ అడ్రస్ గా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించి గురుకులాన్ని టాప్ లో నిలబెట్టాలని పేర్కొన్నారు. తిమ్మాపూర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా మెనూ ప్రకారం టిఫిన్ లంచ్ పెడుతున్నారా విద్యాబోధన ఎలా ఉంది.. వసతులు సౌకర్యాలు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థులకు సమాధానం ఇచ్చారు. అనంతరం స్టాఫ్ రూము, వాష్రూమ్స్ వంటగది స్టోర్ రూమ్ డార్మెటరీ గదులను పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యము పప్పులు



ఇతర సామాగ్రిని పర్యవేక్షించారు. సామాగ్రికి సంబంధించిన ఎక్స్పైరీ డేట్ ను తరచు చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా గురుకులంలో చేపట్టిన మోడ్రన్ కిచెన్ ఆధునికరణ పరులను పరిశీలించారు. గురుకులంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని వసతుల కల్పన.. మెనూ ప్రకారం భోజనం కల్పించే విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ జరపాలని సూచించారు. గురుకులంలో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. శానిటేషన్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గురుకులంలో కోతుల బెడద ఉందని వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్ ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురుకులం అభివృద్ధి,విద్యా బోధన ఇతర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ సరిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల /మార్చి 16, 2026 (వుదయం ప్రతినిధి)

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు దేవేందర్, రజిత తమ దరఖాస్తులో ఎం సి సి ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ లకు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రస్తుత నిత్యవసరాల దృష్ట్యా పరిశీలించి అందించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు షంషేర్ నగర్ స్కూల్ చెందిన లక్ష్మణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్ ను మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా కూల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్జి సమర్పించారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన భర్త వికలాంగుడని, తన కుమారుడు 7వ తరగతి చదువుతూ గురుకుల పరీక్ష రాసాడని, సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని కొత్తూరు గ్రామ రైతులు తాము గత సీజన్ లో పండించిన సన్న రకం వడ్లు



కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, ఇందుకు గాను బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ గ్రామ శివారులో తనకు గల భూమి నుండి కొంత భాగాన్ని ఇతరుల పేరుట అక్రమంగా పట్టా చేశారని, ఈ పట్టాను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు ఎన్నికలను నూతన సభ్యుల పేర్లు నమోదు చేసే వరకు నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమిని వారు మరణించినందున వారసలమైన తమ పేరిట మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారుఅనంతరం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల వసతి గృహాలలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టిసారించాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలో వరదల కారణంగా ఇబ్బందులకు గురయ్యే గృహ నివాసాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమర్పించే నివేదికల ఆధారంగా ప్రజా ప్రయోజనార్థం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- సమయపాలన పాటించాలని అధికారులకు ఆదేశం

నిజామాబాద్ ,మార్చి 16(వుదయం) :

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్ లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ఆదిలాబాద్, (వుదయం):

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పెండింగ్లో పెట్టకుండా, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలన్నారు. అర్జీల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, శాఖల వారీగా వాటిని సునిశితంగా సమీక్షించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నా



రు.ఈ వారం జరిగిన ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు, భూభారతి తదితర సమస్యలపైనే ప్రజల నుంచి ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 85 వినతులు అందాయని పేర్కొన్నారు. ఆయా అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఇండ్ల గణనపై సంపూర్ణ అవగాహన తప్పనిసరి

- జిల్లా స్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు మూడు రోజులపాటు శిక్షణ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్






**గద్వాల మార్చి 16 (వుదయం ప్రతినిధి)** జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా మొదట ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు గాను గణనపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులకు ఇండ్ల గణనపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్ అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉండే జనాభా ఆధారంగా బ్లాక్ లుగా విభజించుకొని గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇండ్ల గణన పూర్తయితే 2027 ఫిబ్రవరిలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 33 ప్రశ్నలను అడిగి వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం చేపట్టే గణన ఆధారంగానే భవిష్యత్తులో వివిధ వర్గాలకు ఆయా సందర్భాల్లో రిజర్వేషన్లు నిర్ణయించడం జరుగుతుంది కాబట్టి గణనను పక్కాగా చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో సుమారు 1100 మంది ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు అవసరమవుతారని, ఉపాధ్యాయులకు ఈ విధులు అప్పగించాలన్నారు. ఈ జనాభా గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో చేయాల్సి ఉన్నందున 2026-2027 సెన్సెస్ ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే ట్రైనర్స్ ను అడిగి వెంటనే పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావు, సెన్సెస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ లాజర్, సిపిఓ పాపయ్య, ట్రైనర్ సుల్తాన్, సంబంధిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు కొరత లేకుండా విత్తనాలు, ఎరువుల సరఫరా




**గద్వాల మార్చి 16 (వుదయం ప్రతినిధి)** రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివ శంకర్ ఆగ్రో ట్రేడర్స్ ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ప్రతి రోజూ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరాలను ఖచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలనీ, ఎరువుల ధరలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉండాలన్నారు. అన్ని విక్రయాలు ఈ - పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, లైసెన్స్ లేకుండా ఎరువుల అమ్మకాలు జరగకూడదని పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ నిల్వచేసిన మందులు, వైద్య సామగ్రిని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు తరలించాలని ఆదేశించారు. ఆసుపత్రి లోపల, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అంతకుముందు గోనుపాడు శివారులో కలెక్టర్ పొలాలను సందర్శించి పంటల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వంద శాతం అక్షరాస్యత పెంచడమే లక్ష్యం

- చదవడం,రాయడం నేర్చుకున్న నిరక్షరాస్య మహిళలకు 29న పరీక్ష,
- అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్



**నాగర్ కర్నూల్ మార్చి 16(వుదయం ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలు వయోజనులకు జిల్లాలో ఇదివరకు చదువు నేర్పిన మహిళలకు ఈనెల 29న నిర్వహించే ప్రీ-ఫైనల్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (FLNAT) కు విధిగా హాజరయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో పరీక్ష నిర్వహణ కోసం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మార్చి 29న నిర్వహించనున్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా పరీక్షలకు అవసరం ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 100% అక్షరాస్య తపించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి నిరక్షరాస్తులు విధిగా పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు.

జిల్లావ్యాప్తంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారిక విద్యకు దూరమైన 15 సంవత్సరాలు పైబడిన వయోజనులకు చదవడం, రాయడం, లెక్కలు మరియు ప్రాథమిక జీవన నైపుణ్యాలు అందించడమే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి, సమాజంలో వారికి ఆత్మవిశ్వాసం పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. జిల్లాలో చదవడం రాయడం నేర్చుకున్న నిరక్షరాస్య మహిళలు, వయోజనులు 25313 మంది ఈ పరీక్షకు హాజరై తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. పరీక్షను జిల్లావ్యాప్తంగా సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని సంబంధిత శాఖల అధికారులు, వలంటీర్లు మరియు నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.

నిరక్షరాస్యుల పరీక్షలకు అవసరమైన ప్రశ్నపత్రాలను ఈ నెలకి 27వ తేదీని జిల్లాలోని పాఠశాలలకు చేర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన చర్యలను మండల స్థాయి వాలంటరీ విధిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, జిల్లా వయోజన విద్య అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ రమేష్ కుమార్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, సీఎంఓ వెంకటయ్య మండల స్థాయి వయోజన విద్య వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి

స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి, మార్చి 16:వుదయం** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ... ప్రజల నుండి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలు , పిర్యాదులు ,వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి వినతిని నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపిచామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపాలని అధికారుల కు అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు , ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జన గణన పథకాల అమలు, దేశ అభివృద్ధికి మూలం

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ జిల్లా: వుదయం ప్రతినిధి;** జనగణన 2027 పథకాల అమలు, దేశ అభివృద్ధికి మూలమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జన గణన-2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు(ఛార్జీ అధికారులు) 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు.జన గణన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమం లో పూర్తి అవగాహన కలిగిస్తుందని అన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జన గణన 2027 సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన నిర్వహించబడుతుందని,తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యూమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు. ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని డైరెక్టరేట్ ఆఫ్ ప్లానింగ్ శాఖ జనాభా లెక్కల అధికారులుశ్రీకాంత్ నాయక్, వంగ పండు గీత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జన గణన,హౌస్ లిస్టింగ్,ఎన్యూమరేషన్ చేయడం శిక్షణ లో అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ ఓ మాంగీ లాల్ ,తాండూర్ డి ఆర్ ఓ అనిత ,ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు,జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, అన్ని మండలాల తహసీల్దార్ లు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 119 దరఖాస్తులు స్వీకరణ

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్ జిల్లా: వుదయం ప్రతినిధి;** ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని,జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి జడ్.పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను వేగంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి మార్చి16 (ఉదయం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 34 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట టౌన్ మార్చి 16(వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద రూ.55 కోట్ల నిధులతో కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. అంతకు ముందు జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడి నుంచి నేరుగా కొత్త కలెక్టరేట్ భవన సముదాయం వద్దకు వెళ్లి ఇప్పటి దాకా జరిగిన నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల గురించి ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. భవన సముదాయ నిర్మాణ పనులతో పాటు బయట రోడ్లు, ఇతర పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు మొరం మట్టి లెవెల్ చేయాల్సి ఉందని ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ కలెక్టర్ కు తెలిపారు. ఎస్టిమేట్ కంటే అదనంగా నిధులు అవసరం అవుతాయని అధికారులు కలెక్టర్ కు తెలపగా ముందే ఎస్టిమేట్ లో అదనపు నిధుల అవశ్యకత ను పొందు పర్చాల్సి ఉండేదని ఆయన సూచించారు. భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జరుగుతున్న పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్ అండ్ బి ఈ.ఈ. వెంకటరమణ, డీ.ఈ. రాములు, ఏ ఈ, తదితరులు పాల్గొన్నారు.




## వాణిజ్య సముదాయం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ బీ.నాగిరెడ్డి

**నాగర్ కర్నూల్ మార్చి 16(వుదయం ప్రతినిధి)** మున్సిపల్ పరిధిలో దుకాణ యజమానులు, కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్, హాస్పిటల్, హోటల్స్, అన్ని షాపులు మార్చి 31 లోగా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి లేనిచో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు 25% పెనాల్టీ మరియు జూలై 1 నుంచి 50% పెనాల్టీ విధించటం జరుగుతుందని లేదా షాపులను సీజ్ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. కావున పట్టణంలోని దుకాణ యజమానులు ముందుకు వచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకొని పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వివరాల కొరకు మున్సిపల్ సిబ్బంది తిరుపతయ్య 9550942030, సతీష్ 9160000 647 లను సంప్రదించాలని తెలిపారు.

## ప్రజావాణి కి 25 ఫిర్యాదులు

**నారాయణపేట మార్చి 16(వుదయం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ గా సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రీజనల్ రింగ్ రోడ్ బాధితులకు అండగా ఉంటాం

జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, మార్చి 16 ( వుదయం ప్రతినిధి)** రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, భూసేకరణ ప్రక్రియకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి కోరారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయంలోని మీటింగ్ హాల్‌లో జగదేవ్‌పూర్ మండలం చెబర్తి, అలిరాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామ రైతులతో నిర్వహించిన 'ఆర్బిటరేషన్' సమావేశంలో ఆమె మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గం గుండా వెళ్తున్న ఈ రింగ్ రోడ్డు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకం. ప్రజావసరాల కోసం భూములను ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం శుభపరిణామం భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో గరిష్ట నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటాం,అభివృద్ధి పనులు వేగవంతం కావడానికి రైతులు భూములను అప్పగించే ప్రక్రియలో అధికారులకు సహకరించాలి.ఈ సమావేశంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ నిర్మల, సంబంధిత శాఖల అధికారులు మరియు బాధిత గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



### సిద్దిపేట వెల్కటూరు బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామంలోని ప్రభుత్వ వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహంలోని వసతులు, భోజన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ వంటగది మరియు స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. వంటగది పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో రాజీ పడకూడదని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉండాలని స్పష్టం చేశారు.కలెక్టర్ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. భోజనం ఎలా ఉంటుంది? వసతులు ఎలా ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నప్పటికీ, చివరగా భోజనానికి వచ్చే విద్యార్థులకు ఆహార పదార్థాలు సరిపోవడం లేదని పలువురు విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విద్యార్థులందరికీ సరిపడా ఆహారం అందేలా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. "తల్లిదండ్రులను, సొంత ఊరిని వదిలి ఇక్కడ ఉంటున్నామని ఎవరూ బాధపడకూడదు. మంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలి. లక్ష్యాన్ని పెట్టుకుని, సమయాన్ని వృధా చేయకుండా చదువుకోవాలి. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి" అని హితవు పలికారు.




# జన గణన కట్టుదిట్టంగా నిర్వహించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ
- భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికకు గణాంకాలు కీలకం
- జనగణన 2027 హౌస్ లిస్టింగ్ పై సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి-16 (వుదయం ప్రతినిధి)** జనగణన 2027 కార్యక్రమాన్ని మన పెద్దపల్లి జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తెలిపారు. సోమవారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ , హౌసింగ్ సెన్సెస్ సంబంధించి సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ. అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ.. జనగణన తొలి దశ పై శిక్షణ కార్యక్రమం మార్చి 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని అన్నారు.జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. జనగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి మీద ఉందన్నారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన అధికారులు పూర్తి స్థాయిలో శిక్షణ పొంది అవగాహన పొందాలని తెలిపారు. జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల/ మున్సిపల్/ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

జిల్లా అదనపు కలెక్టర్ పీ.చంద్రయ్య



**మంచిర్యాల /మార్చి 16, 2026 (వుదయం ప్రతినిధి)** అధికారులు తమ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కార్మికులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఉపాధి కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించి ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, చెత్త సేకరణ, శుభ్రత నిర్వహణ, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు.

## మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం

అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక వందన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత లను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు, నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. నిర్దేశిత విస్తీర్ణంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇందిరమ్మ ఇల్లు కేటాయించబడి నిర్మాణం చేపట్టని మహిళతో ఇల్లు నిర్మించుకునేలా ప్రోత్సహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమారం తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలి

- కొత్త క్రషర్ టెండర్లకు పర్మిషన్లు ఇవ్వొద్దు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన పత్తిపాక గ్రామ ప్రజాప్రతినిధులు



**హనుమకొండ/శాయంపేట, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాని అనుమతులను తక్షణమే రద్దు చేయాలని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పత్తిపాక గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రషర్ నుండి వెలువడుతున్న విపరీతమైన దుమ్ము, శబ్ద కాలుష్యం కారణంగా గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కి క్రషర్ నిర్వహిస్తున్నారని, దీనివల్ల పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపారని, బోర్ బ్లాస్టింగ్స్ వల్ల ఇండ్లు పగుల్లుపడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న క్రషర్‌తోనే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుంటే, కొత్తగా మరో క్రషర్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త క్రషర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయకూడదని కోరారు.

"గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ తమకు ముఖ్యమని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్రషర్లపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక ఉప సర్పంచ్ తుడుం రాజు, వార్డు మెంబర్లు నాలికె వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల సారయ్య, గజ్జి రాజు, అంకేశ్వరపు సాయి లక్షి , కొడిమాల మహేందర్, గజ్జి రమేష్, గడ్డమీది హారతి కర్ణాకర్, చిట్టి రెడ్డి పద్మ జంగారెడ్డి, ఐరబోయిన స్వప్న రాజు, కందగట్ల ప్రవీణ్ కుమార్, తుడుం స్రవంతి రాజు, నాయకులు పెండేల కిరణ్, పోతుగంటి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 114 దరఖాస్తులు

అదనపు కలెక్టర్ లోకల్ బాడి మధుమోహన్

**కామారెడ్డి, మార్చి 16 (వుదయం):–** కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని 25వ నంబర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ మధుమోహన్ పాల్గొని దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారుల నుండి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 114 వచ్చాయని అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సీఈఓ చందర్, ఏవో, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు**
**జిల్లాస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు**

**ములుగు, మార్చి 16 (వుదయం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశమును జిల్లా సంక్షేమ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరై మాట్లాడుతూ మన జిల్లాలో నూతనంగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ జిల్లా బాలల పరిరక్షణ కమిటీ జిల్లా కలెక్టర్ చైర్మన్ గా 14 మంది జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో ఉన్న మండల, గ్రామ, వార్డు బాలల పరిరక్షణ కమిటీలను సమన్వయం పరుస్తూ జిల్లాలోని బాలలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. జిల్లాలోని బాలల రక్షణ పై అవగాహన కల్పించడం, ఆరు సంవత్సరాల పైబడిన బాలలందరూ బడికి వెళ్లేలా చూడడం, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించడం, బాలల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామ సభల్లో బాలల గురించి చర్చించేలా చూడటం, బాల్యవివాహాల వల్ల, పిల్లలను పనిలోకి పంపించడం వల్ల ఎదురయ్యే అనర్థాలను గుర్తించి అవగాహన కార్యక్రమాల నిర్వహిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలను బాలల స్నేహపూర్వక గ్రామంగా, బాలల ఆదర్శ గ్రామాలుగా మార్చేందుకు కృషి దిశగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని బాలల హక్కుల సంరక్షణ కొరకు పని చేసే జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్ లైన్ తదితర సంస్థలని పర్యవేక్షిస్తూ ఉన్నతమైన సేవలను బాలలకు అందేలాగా ఈ కమిటీ చూస్తుందనీ జిల్లా సంక్షేమ అధికారిని ప్రేమ లత తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ ద్వారా జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను కమిటీ సభ్యులకు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ కమిటీ సభ్యులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వివిధ జిల్లా అధికారులు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 5 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ టౌన్, మార్చి 16 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ నగరంలోని ఎస్.ఆర్.ఆర్.తోట. కరీమాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.అనిత కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. పెండింగులో ఉన్న 5 నెలల వేతనాలు అనగా (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి) వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో 17 మార్చి 2026 నుంచి మధ్యాహ్నం లంచ్ సమయంలో నల్ల రిబ్బన్లు ఉద్యోగులు ధరించి నిరసన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని , గత చాలా సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు, పేదవారికి సేవ అందించడంలో ముందు వరస లో ఉన్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎస్.ఆర్.ఆర్.తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సింగ్ ఆఫీసర్లు గుడి కందుల వాణి , మేకల మంజుల, గూడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు...



# 24లోపు ఎస్సీ యువతీ యువకులు దరఖాస్తులు సమర్పించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- రూ. 4 కోట్ల 60 లక్షలతో 228 యూనిట్లు జిల్లాకు కేటాయింపు

**పెద్దపల్లి, మార్చి 16 (వుదయం ప్రతినిధి)** మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించిందని అన్నారు.

2025-26 వార్షిక ప్రణాళికకు సంబంధించి 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు లోన్ తో లక్ష రూపాయల విలువ గల 100 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లోన్ తో 3 లక్షల రూపాయలు విలువ గల 71 త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 7 లక్షల రూపాయలు విలువ గల 15 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ సెట్ లను పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు,

వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలని, అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, ఆధాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు నిరుద్యోగ ఎస్సి యువతీ యువకులు మార్చి 24 లోగా తమ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in లో నమోదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఎల్పీజీ ధర మూడు నెలల్లో రూ.300 పెంచిన కేంద్రం

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి**

**ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 16** రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది, ఇజ్రాయిల్,ఇరాన్ యుద్ధంతో భారతదేశం ఇబ్బందిపడుతుంది. ఎల్ పి జి సిలిండర్ పై మూడు నెలల్లో 300 రూపాయలు పెంచింది కేంద్ర ప్రభుత్వం . అబద్ధాలు చెప్పే కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. రేపు జరగబోయే పార్లమెంట్ సమావేశంలో ఇదే విషయంపై మాట్లాడబోతున్నాను. రాబోయే రోజుల్లో రైతులకు నష్టపోయే అవకాశం ఉంది. ఈ యుద్ధం వల్ల యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉంది.

సామాజిక మాధ్యమాల్లో వచ్చే అన్ని నమ్మాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో అడ్డగోలు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో ఇరాన్ దే పై చేయి. యుద్ధం నేపథ్యంలో ఏం చేయాలో ఆలోచించలేని స్థితిలో ప్రధాని మోడీ ఉన్నాడు. ఆ భద్రాచల శ్రీరాము చంద్రుని ఆశీస్సులు దేశ ప్రజలకు ఉండాలి. ఇంకా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కరెంట్ లేని గూడాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటూ కు బిజెపి ఓటు వేయలేదా. తెలంగాణ రాష్ట్రం అంటే బిజెపి కి ఎందుకు అంత చిన్న చుపు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కష్టపడుతున్నాడు. ఆయిల్ తో పాటు ప్లాస్టిక్ రేట్లు పెరిగే అవకాశం ఉంది.

# వివిధ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**సూర్యాపేట వుదయం జిల్లా ప్రతినిధి (మార్చి 16)** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా "సి" సెక్షన్, జిల్లా కోశాధికారి కార్యాలయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఎన్ఐసి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి, హౌసింగ్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయా లను సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కార్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నాయా అని పరిశీలించారు . ఫైల్స్, పిఆర్ రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయో లేదో అని తనిఖీ చేశారు. కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా క్రమ పద్ధతిలో ఉండాలని, కార్యాలయాలు పరిశుభ్రంగా ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఉండాలని, హాజరు, పి ఆర్ రిజిస్టర్లు, కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా నిర్వహించాలని ప్రతి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఏవో సుదర్శన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట వుదయం జిల్లా ప్రతినిధి( మార్చి 16 )** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని ,అలాగే రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు .ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,అలాగే ప్రతి కార్యాలయంలోని ఫైల్స్ అన్ని సక్రమంగా ఉంచుకోవాలని ,ప్రతి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ యాప్ లో నమోదు చేయాలని, కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం సందర్శిస్తానని, ఫైల్స్ సరిగా లేకపోయినా, శుభ్రంగా ఉండని కార్యాలయాల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 41 దరఖాస్తులు,డిడబ్ల్యుఓ 4, డిపిఓ 3, డి ఆర్ డి ఏ 3', మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం. 68 దరఖాస్తులు వచ్చాయాని ,వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల దగ్గర ఉన్న పెండింగ్ ఆడిట్ పేరాలను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి జడ్పీసీఈఓ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్ జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు హాజరైనారు



# మోడీ తీరే ధరల పెరుగుదలకు కారణం

**ఖమ్మంవుదయం బ్యూరో:** ట్రంప్ యుద్ధ కాంక్ష భారతదేశంలో సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణిస్తున్నాయని ఆయన తెలిపారు.

గ్యాస్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలియజేశారు. ధరలను తగ్గించాలని కేంద్ర విధానాలే ధరల పెరుగుదలకు కారణమని నినదించారు. ఈ ఆందోళను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ సంపదపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంపన్న దేశాలపై దాడులు చేసి అక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆ క్రమంలోనే ఇజ్రాయెల్తో చేతులు కలిపి ఇరాన్పై దాడులు చేస్తున్నారన్నారు. మోడీ అలీన దేశపు ప్రధానిగా యుద్ధాన్ని నివారించకపోగా యుద్ధం వల్ల ఎదురయ్యే విపత్కర పరిస్థితులను అంచనా –వేయడంతో వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. దిగుమతుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యం చెందిన కారణంగానే ధరలు పెరిగాయని హేమంతరావు తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలన్నారు. ఇతర దేశాలకు ఎగుమతులు చేసే వాటి ధరలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన తెలిపారు. యుద్ధం ఆగకపోతే రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పాటు కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణం ధరలను తగ్గించే చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. మోడీ ట్రంప్ ముందు మోకారిల్లుతూ దేశ ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పుచ్చకాయల సుధాకర్, గాదె లక్షి నారాయణ, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, బానోత్ రాంకోటి, ఎస్కె సైదా, మడుపల్లి లక్ష్మణ్, శ్రవణ్, చింతల రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.53వేల కోట్ల ఎఫ్ఐఐలు పలాయనం




ఇరాన్‌పై అమెరికా యుద్ధోన్మాదం ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. మార్చి మొదటి పక్షం రోజుల్లోనే విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) ఏకంగా రూ.52,704 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఈ ఏడాదిలోనే అత్యధికంగా శుక్రవారం ఒక్కరోజే రూ.10,717 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. యుద్ధం 15వ రోజుకు చేరడం గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడంతో విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తగ్గుతుండగా దేశీయ ఇన్వెస్టర్లు వరుస నష్టాలతో బెంబేలెత్తుతున్నారు. గడిచిన 13 సెషన్లలో దాదాపు రూ.33లక్షల కోట్ల సంపద హరించుకుపోయిన విషయం తెలిసిందే.




## కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కేటాయింపు షురూ



దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్ విభాగాలకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ ప్రక్రియను వివిధ రాష్ట్రాలు ప్రారంభించాయి. ఢిల్లీ సహా దాదాపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ కేటాయింపులు అమల్లోకి వచ్చాయి.ప్రాధాన్యత క్రమంలో పంపిణీప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) రోజువారీ సగటు వినియోగంలో 20 శాతం మేర నియంత్రిత పంపిణీ కోసం కేటాయించాయి. ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో రోజుకు సుమారు 1,800 సిలిండర్లను ఈ విధానం కింద పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంపిణీలో ఐదు స్థాయిల ప్రాధాన్యతను నిర్ణయించారు:స్థాయి 1, 2: విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రైల్వేలు, విమానాశ్రయాలకు అత్యున్నత ప్రాధాన్యత.స్థాయి 3: రెస్టారెంట్లు, భోజనశాలలకు 42 శాతం వాటా.స్థాయి 4: హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, ట్రస్టులకు 4 శాతం కేటాయింపు.స్థాయి 5: డెయిరీలు, బేకరీలు, స్వీట్ షాపులకు 11 శాతం కేటాయింపు.రాష్ట్రాల వారీగా..కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఇప్పటికే ఢిల్లీ, బిహార్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీ చేశాయి. గృహ వినియోగ గ్యాస్ మళ్లింపును అరికట్టడానికి, వాణిజ్య అవసరాలకు అంతరాయం కలగకుండా చూడటానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది.

## అంతర్జాతీయ చెల్లింపుల్లో ఫిన్‌టెక్ స్టార్టప్‌ల దూకుడు





భారతీయ సాఫ్ట్‌వేర్ సర్వీసులు, ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ పెరుగుతోంది. ఈ తరుణంలో నగదు లావాదేవీలు సులభతరం చేసే ప్రక్రియ వేగవంతం అవుతోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంక్లిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థల స్థానంలో స్వదేశీ ఫిన్‌టెక్ స్టార్టప్‌లు అత్యంత సులభమైన, పారదర్శకమైన సాంకేతిక వేదికలను అందుబాటులోకి తెస్తున్నాయి.గతంలో అంతర్జాతీయ చెల్లింపులంటే స్విఫ్ట్ వంటి సాంకేతికతపై ఆధారపడాల్సి వచ్చేది. నగదు చేరడానికి అనేక మధ్యవర్తిత్వ బ్యాంకుల గుండా ప్రయాణించాల్సి రావడం వల్ల రోజుల కొద్దీ సమయం పట్టడమే కాకుండా, భారీగా చార్జీలు వసూలయ్యేవి. ఇది పెద్ద కంపెనీలకు భారంగా అనిపించకపోయినా చిన్న ఎగుమతిదారులు, ఫ్రీలాన్సర్లు, ఎస్ఎంఈలకు పెద్ద సవాలుగా ఉండేది.ప్రస్తుతం ఫిన్‌టెక్ సంస్థలు సాఫ్ట్‌వేర్ ఆధారిత మౌలిక సదుపాయాలను రూపొందించడం ద్వారా ఈ అంతరాన్ని పూడుస్తున్నాయి. దీనివల్ల విదేశీ మారక ద్రవ్య నిర్వహణ, నియంత్రణ సంస్థల నిబంధనల అమలు ఆటోమేషన్ ద్వారా సులభతరం అవుతున్నాయి.గ్లోబల్ మార్కెట్‌లో భారతీయ ముద్ర'అంతర్జాతీయ వాణిజ్యం ఇప్పుడు కేవలం కార్పొరేట్ దిగ్గజాలకే పరిమితం కాలేదు. ఈ విభాగంలో స్టార్టప్ కంపెనీలు సులభంగా సర్వీసులు అందిస్తున్నాయి' అని రేజర్‌పే సీఓఓ రాహుల్ కొఠారి విశ్లేషించారు. సాస్ సంస్థల నుంచి ఇ-కామర్స్ బ్రాండ్ల వరకు అన్నీ అంతర్జాతీయ కస్టమర్లను లక్ష్యంగా చేసుకుంటున్నాయని చెప్పారు. రేజర్‌పే ప్రస్తుతం 130కి పైగా కరెన్సీల్లో చెల్లింపులను అనుమతిస్తోందన్నారు.ఎయిర్‌బీఎన్‌బీ, షాపిఫై వంటి గ్లోబల్ బ్రాండ్లతో పాటు ఆకాశా ఎయిర్, హౌస్ ఆఫ్ మసాబా వంటి భారతీయ బ్రాండ్లు కూడా వీటి సేవలను వినియోగిస్తున్నాయి. క్రాస్-బోర్డర్(వి దేశాలు) విభాగంలో లావాదేవీలు జరిపే వినియోగదారుల సంఖ్య రెట్టింపు అవుతోంది.నమ్మకమే పెట్టుబడి..విదేశీ కస్టమర్లు తమకు అలవాటైన యాపిల్ పే లేదా అంతర్జాతీయ క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు చేసే వెసులుబాటు కల్పించడం వల్ల వ్యాపారాలు మెరుగుపడుతున్నాయని క్యాష్‌ఫ్రీ సీఈఓ ఆకాష్ సిన్హా తెలిపారు. 'భారతదేశంలో అంతర్జాతీయ కార్డు లావాదేవీలు విఫలమయ్యే రేటు 35-40% వరకు ఉంటుంది. కానీ యూపీఐ, రూపే వంటి స్థానిక పద్ధతులను అనుసంధానించడం ద్వారా సక్సెస్ రేటును పెంచగలిగాం' అని చెప్పారు. ఎగుమతిదారులకు భరోసాఫ్రీలాన్సర్లు, చిన్న ఎగుమతిదారుల కోసం స్కైడో సంస్థ ప్రత్యేక సేవలను అందిస్తోంది. ఎగుమతి చేసిన తర్వాత బ్యాంకుల నుంచి పొందాల్సిన ఫిరా(ఫారెన్ ఇన్వార్డ్ రెమిటెన్స్ అడ్వైజ్) వంటి పత్రాల సేకరణను ఈ సంస్థ సులభతరం చేస్తోంది. ప్రస్తుతం స్కైడో ఏడాదికి సుమారు 1 బిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలను నిర్వహిస్తోంది. వస్త్రాలు, ప్రాసెస్ చేసిన ఆహారం, గృహాలంకరణ వస్తువుల ఎగుమతిదారులు ఈ ప్లాట్‌ఫామ్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు.ఆర్‌బీఐ వెన్నుదన్ను భారత రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టిన పేమెంట్ అగ్రిగేటర్--క్రాస్ బోర్డర్ నిబంధనలు ఈ రంగానికి కొత్త ఊపిరి పోశాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ వల్ల ఫిన్‌టెక్ సంస్థలకు స్పష్టమైన గుర్తింపు లభించడమే కాకుండా బ్యాంకులపై పూర్తిస్థాయి ఆధారపడటం తగ్గింది. భవిష్యత్తులో ఈ సంస్థలు కేవలం చెల్లింపులకే పరిమితం కాకుండా గ్లోబల్ బిజినెస్‌లకు అవసరమైన పూర్తిస్థాయి ఫైనాన్షియల్ ఆపరేటింగ్ సిస్టమ్‌గా ఎదగాలని ప్లాన్ చేస్తున్నాయి.

## కార్పొరేట్ సారథులకు అగ్నిపరీక్ష



పశ్చిమ ఆసియా సంక్షోభం కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, భారతీయ కార్పొరేట్ రంగాన్ని కుదిపేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతటి స్థాయి అనిశ్చితిని సృష్టించిన ఈ పరిణామాలను ఎదుర్కోవడంలో కార్పొరేట్ కంపెనీల సీఈఓలు అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రత్యేక కథనం. సాధారణంగా ఏదైనా విపత్తు సంభవించినప్పుడు కంపెనీల అధినేతలు గత చరిత్రను పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ప్రస్తుత పశ్చిమ ఆసియా సంక్షోభం అసాధారణమైంది. గత అనుభవాలేవీ దీనికి సరిపోలవు. ఈ నేపథ్యంలో వ్యాపార రంగానికి పొంచి ఉన్న ప్రధానముప్పులు కిందివిధంగా ఉన్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల పెట్రోల్ నుంచి ఎరువుల వరకు అన్ని ఉత్పత్తుల ధరలు భారమవుతాయి.ఎఫ్ఎంసీజీ రంగంలో ప్యాకేజింగ్ ఖర్చు 10% కంటే ఎక్కువగా ఉంటుంది. పెట్రో-డెరివేటివ్స్ ధరలు పెరగడం వల్ల ఈ వ్యయం మరింత భారం కానుంది.కొవిడ్ తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న గ్లోబల్ సప్లై చెయిన్ మళ్లీ సంక్షోభంలో పడింది. పశ్చిమ ఆసియా మీదుగా సాగే రవాణా మార్గాలపై అనిశ్చితి నెలకొంది.గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే పెట్టుబడులు, రెమిటెన్స్‌లు తగ్గే అవకాశం ఉంది. ఇది భారతీయ నగరాల్లో రియల్ ఎస్టేట్ ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.దుబాయ్ వంటి పర్యాటక కేంద్రాలకు డిమాండ్ తగ్గి విమాన ప్రయాణాలు మరింత భారంగా మారుతాయి.బంగారం ధరలు తగ్గడం, విలాసవంతమైన బ్రాండ్ మార్కెట్ దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి. వినియోగదారుడి కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకుని కంపెనీలు తమ కార్యాచరణను మార్చుకోవాలి.

## మెటాలో 16వేల ఉద్యోగులపై వేటు..




కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణ టెక్ రంగంలో ఉద్యోగుల పాలిటశాపంగా మారుతోంది. ఇప్పటికే గడిచిన రెండేండ్లలో భారీగా సిబ్బందిని తగ్గించుకున్న ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరోసారి వేలాది మందిని రోడ్డున పడేసే పనిలో ఉంది. ఏకంగా 16,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు మార్క్ జుకర్‌బర్గ్ బృందం ప్రణాళికలు రచిస్తోందని అంతర్జాతీయ మీడియాలో రిపోర్టులు వస్తోన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తన పట్టును నిరూపించుకునేందుకు మెటా వేల కోట్ల డాలర్లను కుమ్మరిస్తోంది. 2028 నాటికి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం దాదాపు 600 బిలియన్ డాలర్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ భారీ ఖర్చును భర్తీ చేయడానికి, ఏఐ సేవలపై దృష్టి పెట్టడానికి మనుషుల అవసరం లేదని మెటా భావిస్తున్నట్టు సమాచారం. తన మొత్తం సిబ్బందిలో 20శాతం మందిని తొలగించాలని కంపెనీ టాప్ ఎగ్జిక్యూటివ్స్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. మెటా చరిత్రలో ఇవి మూడవ అతిపెద్ద తొలగింపులు కానున్నాయి.

## లక్షన్నర జీతం.. రూ.15 వేలు కూడా మిగల్లేదు!




బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో అధిక జీతాలు ఉన్నప్పటికీ, పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా నెలాఖరుకు పెద్దగా పొదుపు మిగలకపోవడం చాలా మంది ఉద్యోగుల వాస్తవ పరిస్థితిగా మారుతోంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక పోస్టు ఈ పరిస్థితిని స్పష్టంగా చూపించింది. తన బంధువు అనుభవాన్ని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'(గతంలో ట్విట్టర్)లో ఓ యూజర్ పంచుకున్నారు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టభద్రుడైన అతని బంధువు మొదటి సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగం కోసం నెలకు రూ.1.5 లక్షల జీతంతో బెంగళూరుకు వెళ్లాడని చెప్పారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అతను పెద్ద విజయాన్ని సాధించాడని భావించినప్పటికీ, కొన్ని నెలల తర్వాత నగర జీవన వ్యయం ఎంత భారంగా ఉంటుందో అతనికి అర్థమైంది.వచ్చే జీతంలో దేనికి ఎంత ఖర్చు అవుతోందన్నది ఆయన వివరంగా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇంటి అద్దె: ఆఫీస్‌కు సమీపంలోని చిన్న అపార్ట్‌మెంట్‌కు సుమారు రూ.36,000కిరాణా సామాగ్రి: రూ.13,000 -- రూ.15,000ప్రయాణ ఖర్చులు: ట్రాఫిక్ కారణంగా క్యాబ్‌లు, ఆటోల కోసం రూ.6,000 -- రూ.8,000ఇతర ఖర్చులు: ఆన్‌లైన్ ఫుడ్, కాఫీ, వీకెండ్ విహారాలు కోసం రూ.10,000 -- రూ.12,000ఇవి కాకుండా సబ్‌స్క్రిప్షన్లు, వైద్య ఖర్చులు, అనుకోని బిల్లులు, అలాగే ఇంటికి డబ్బు పంపడం వంటి ఖర్చులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ అన్ని ఖర్చుల తర్వాత నెలాఖరుకు అతనికి కేవలం రూ.15,000 నుంచి రూ.20,000 వరకు మాత్రమే పొదుపు మిగులుతుందని తెలిపారు. ఈ అనుభవం ద్వారా అతను ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించాడని పోస్టులో పేర్కొన్నారు. "సొంతూరులో నెలకు రూ.1 లక్షకుపైగా జీతం చాలా పెద్దదిగా అనిపిస్తుంది. కానీ బెంగళూరు వంటి మెట్రో నగరంలో అదే జీతం కేవలం ప్రారంభ స్థాయి మాత్రమే" అని వ్యాఖ్యానించారు.సోషల్ మీడియాలో భిన్న స్పందనలుఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వేలల్లో వ్యూస్, వందలాది లైక్‌లను సాధించింది. చాలా మంది నెటిజన్లు తమ అనుభవాలను కూడా పంచుకున్నారు. "సొంతూరులో అదే జీతంతో ఎక్కువగా పొదుపు చేయవచ్చు", "పెద్ద నగరాలు మీకు తెలియకుండానే డబ్బును వేగంగా ఖర్చు చేయిస్తాయి" అని కొందరు వ్యాఖ్యానించగా "సరైన ఎంపికలు చేస్తే ఖర్చులను నియంత్రించుకోవచ్చు" అని మరో యూజర్ కామెంట్ చేశారు.




## శ్రీలంక క్రికెట్ టోర్నీకి భరత్‌రెడ్డి.. అభినందించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



హుజూర్‌నగర్ : సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని హుజూర్‌నగర్ యువకుడు బొబ్బ భరత్‌రెడ్డి చేతల్లో చూపెట్టాడు. సూర్యాపేట జిల్లా నుంచి క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న భరత్‌రెడ్డి ఈనెల 15వ తేదీ నుంచి శ్రీలంకలో మొదలయ్యే అంతర్జాతీయ స్థాయి టీ20, వన్డే టోర్నీలకు ఎంపికయ్యాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన భరత్‌రెడ్డి తల్లిదండ్రులు భాస్కర్‌రెడ్డి, నిర్మల క్రికెట్‌లో అతన్ని ప్రోత్సహిస్తూ వచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన భరత్ గత ఏడేండ్లుగా బుచ్చిబాబు, ఇంద్రశేఖర్‌రెడ్డి దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు.హుజూర్‌నగర్, మార్చి 15: సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని హుజూర్‌నగర్ యువకుడు బొబ్బ భరత్‌రెడ్డి చేతల్లో చూపెట్టాడు. సూర్యాపేట జిల్లా నుంచి క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న భరత్‌రెడ్డి ఈనెల 15వ తేదీ నుంచి శ్రీలంకలో మొదలయ్యే అంతర్జాతీయ స్థాయి టీ20, వన్డే టోర్నీలకు ఎంపికయ్యాడు.

## గిల్, మంధాన మెరిసె.. అత్యుత్తమ క్రికెటర్ అవార్డులు కైవసం

### వరల్డ్‌కప్ టీమ్‌లకు బీసీసీఐ ఘన సత్కారం





బీసీసీఐ వార్షిక అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల సమక్షంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో క్రికెటర్లు సందడి చేశారు. 2025-26 సీజన్‌లో ఏకంగా ఐదు ఐసీసీ ట్రోఫీలతో కొత్త చరిత్ర లిఖించిన భారత క్రికెటర్ల ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. ఇందుకు తోడు దేశ క్రికెట్‌కు ఎనలేని సేవలు అందించిన దిగ్గజ ప్లేయర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్, మిథాలీ రాజ్‌ను బీసీసీఐ ఘనంగా సన్మానించింది. కండ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో 'నమన్' అవార్డుల వేడుక యువకులు, అనుభవజ్ఞుల కలయికగా జరిగింది. గత సీజన్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన టీమ్‌ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్‌గిల్‌తో పాటు మహిళల క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేకతను లిఖించుకున్న స్మృతి మంధాన అంతర్జాతీయ అత్యుత్తమ క్రికెటర్ల అవార్డులు కైవసం చేసుకున్నారు.ముఖ్యంగా కెప్టెన్‌గా తొలిసారి ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో గిల్ అంచనాలకు మించి రాణించాడు. సిరీస్‌లో పది ఇన్నింగ్స్‌లో 75.40 సగటుతో 754 పరుగులు చేసి టోర్నీ టాపర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లను వారి సొంతగడ్డపైనే దీటుగా నిలువరిస్తూ సిరీస్ 2-2తో డ్రా కావడంలో కీలకంగా వ్యవహరించాడు. ఇంగ్లిష్ పిచ్‌లపై అంతగా ఆడిన అనుభవం లేకపోయినా దిగ్గజాల గైర్హాజరీలో గిల్ దుమ్మురేపాడు. తన దూకుడైన బ్యాటింగ్‌తో ఓ డబుల్ సెంచరీ(269) సహా నాలుగు సెంచరీలు ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలోనూ గిల్ అదరగొట్టాడు.వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంక్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన గిల్..బంగ్లాదేశ్‌పై అజేయ సెంచరీ(101 నాటౌట్) సహా టోర్నీలో 188 పరుగులతో టీమ్‌ఇండియా ట్రోఫీ విజయంలో కీలకమయ్యాడు. పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేతగా నిలిచిన గిల్ స్పందిస్తూ 'ఈ అవార్డు కోసం బీసీసీఐ నన్ను గుర్తించినందుకు ధన్యవాదాలు. ఎంతో మంది దిగ్గజ క్రికెటర్లు ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. దీన్ని దక్కించుకోవడం చాలా గర్వంగా భావిస్తున్నా. ఇది నా ఒక్కని వల్ల సాధ్యం కాలేదు, సహచరుల సహకారంతో అవార్డు పొందగలిగాను. నన్ను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు అందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నాడు. మరోవైపు రికార్డు స్థాయిలో ఐదో సారి మహిళల బెస్ట్ ఇంటర్నేషనల్ క్రికెటర్ అవార్డు మంధాన సొంతమైంది. 2025 సీజన్‌లో మంధాన 1703 పరుగులు చేసింది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా మంధాన అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. 'ఇది నాకు ఎంతో ప్రత్యేకం. జట్టు సహకారం లేకుండా వ్యక్తిగత రికార్డుల గురించి మాట్లాడం సరైంది కాదు. నా కెరీర్‌లో ఇది అద్భుతమైన ఏడాది. అవార్డుకు ఎంపిక చేయడంతో పాటు మహిళా క్రికెట్ అభివృద్ధికి తోడ్పడుతున్న బీసీసీఐకి ధన్యవాదాలు' అని మంధాన అంది.చాంపియన్ టీమ్‌లకు సత్కారం గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ కేటగిరీల్లో భారత క్రికెట్ జట్లు ఐదు ఐసీసీ ట్రోఫీలు కైవసం చేసుకోవడం విశేషం. 2025 మహిళల అండర్-19 ప్రపంచకప్‌తో మొదలుపెడితే ఆ తర్వాత పురుషుల చాంపియన్స్ ట్రోఫీ, మహిళల వన్డే ప్రపంచకప్, 2026లో అండర్-19 ప్రపంచకప్, పురుషుల టీ20 వరల్డ్‌కప్ సభ్యులను బీసీసీఐ ఘనంగా సన్మానించింది. ఆయా జట్లలో సభ్యులైన క్రికెటర్లు జ్ఞాపికలు అందుకున్నారు. అవార్డుల వివరాలు

షెఫాలీవర్మ...
(బెస్ట్ వుమన్ సీనియర్ క్రికెటర్-దేశవాళీ వన్డే)
ఇరా జాదవ్... (బెస్ట్ వుమన్ క్రికెటర్- దేశవాళీ)
హర్ష్‌దూబె ... (బెస్ట్ ఆల్‌రౌండర్-రంజీ ట్రోఫీ)
ఆయూశ్ మాత్రె... (బెస్ట్ ఆల్‌రౌండర్-దేశవాళీ పరిమిత ఓవర్ల ఫార్మాట్)

దిగ్గజాలకు సన్మానం

దేశ క్రికెట్‌కు సేవలందించిన రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ అత్యున్నత పురస్కారం కర్నల్ సికే నాయుడు అవార్డు దక్కగా, హైదరాబాదీ దిగ్గజం మిథాలీ రాజ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో మెరిసింది.

## 'వాళ్ల ఫీజు మన సైనికుల ప్రాణాలు తీస్తోంది'



హండ్రెడ్ మెన్స్ టీ20 టోర్నీకి సంబంధించి ఆటగాళ్ల కోసం జరిగిన వేలంలో కావ్యా మారన్‌కు చెందిన సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేయడం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. వేలంలో అబ్రార్ అహ్మద్‌ను 1,90,000 పౌండ్లకు (సుమారు రూ. 2.34 కోట్లు) సొంతం చేసుకుంది. అయితే పాక్ ఆటగాళ్లను కొనుగోలు చేయడం పట్ల సోషల్ మీడియాలో భారత మాజీ క్రికెటర్లు సహా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సన్‌రైజర్స్ లీడ్స్‌కు సంబంధించి 'ఎక్స్' ఖాతాను కూడా సస్పెండ్ చేయడం గమనార్హం. తాజాగా టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా సన్‌రైజర్స్ పాక్ ఆటగాళ్లను కొనుగోలు చేయడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ది హండ్రెడ్ టోర్నీలో ఒక ఫ్రాంచైజీ పాకిస్థాన్ ఆటగాళ్లను కొనుగోలు చేయడం ఆశ్చర్యం కలిగించకపోవచ్చు. కానీ భారత్‌కు చెందిన ఒక ఐపీఎల్ ఫ్రాంచైజీ పాక్ ఆటగాళ్లను తీసుకోవడం నచ్చడం లేదు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌తో సంబంధాలు క్షీణించడంతో ఆ దేశంలో ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఐపీఎల్ వేలంలోనూ పాక్ ఆటగాళ్లను విస్మరించడం జరిగింది. ఐపీఎల్ 2008 సీజన్ మినహా పాక్ ఆటగాళ్లు మళ్లీ ఐపీఎల్‌లో కనిపించలేదు. కానీ తాజాగా సన్‌రైజర్స్ యాజమాన్యానికి చెందిన సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేసింది. సదరు ఫ్రాంచైజీ పాక్ ఆటగాడికి ఫీజు రూపంలో చెల్లించే డబ్బులను అతడు తన దేశానికి పన్నుల రూపంలో చెల్లించడం జరుగుతుంది. పన్నుల రూపంలో వచ్చిన డబ్బులతోనే పాక్ ప్రభుత్వం ఆయుధాలు కొనుగోలు చేస్తున్నది. ఆ ఆయుధాలే ఇవాళ మన భారత సైనికులు, పౌరుల మరణాలకు పరోక్షంగా కారణమవుతున్నాయి. దీంతో తెలిసీ తెలియకో సన్‌రైజర్స్ లీడ్స్ ఒక రకంగా ప్రాణనష్టానికి పాల్పడుతున్న దేశంతో సంబంధం కొనసాగిస్తున్నట్లే అవుతుంది. అందుకే అభిమానుల ఆగ్రహంలో నాకు తప్పు కనిపించలేదు. ఈ ఆగ్రహం ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.' అని చెప్పుకొచ్చారు. మరోవైపు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా మాత్రం.. 'ఇది మాకు సంబంధించిన విషయం కాదు. అదొక విదేశీ లీగ్. తుది నిర్ణయం ఆ ఫ్రాంచైజీయే తీసుకోవాలి. మేము జోక్యం చేసుకోలేము' అని పేర్కొన్నారు.

## క్రిస్ గేల్ రికార్డు బద్దలు కొట్టడమే లక్ష్యం: వైభవ్ సూర్యవంశీ




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల కార్యక్రమం 'నమన్ -2026' ఆదివారం ఘనంగా జరిగింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ వేడుకలో భారత సీనియర్, జూనియర్, పురుషులు, మహిళలు, మాజీలు అంతా ఒక్క చోట చేరడంతో సందడి నెలకొంది. ఫైనల్లో 175 పరుగులుఈ అవార్డుల కార్యక్రమంలో చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ హైలైట్ అయ్యాడు. పద్నాలుగేళ్ల వయసులోనే క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బిహారీ పిల్లాడు.. అండర్-19 వరల్డ్‌కప్-2026 ఫైనల్లో ఇంగ్లండ్‌పై 175 పరుగులు సాధించాడు. తద్వారా భారత్ విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక నమన్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఆయుశ్ మాత్రే సారథ్యంలోని అండర్-19 వరల్డ్‌కప్ విజేత జట్టు పురస్కారాలు అందుకుంది. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ మాట్లాడుతూ.. "ఈ అనుభూతి గొప్పగా ఉంది. వరల్డ్ కప్‌లో గెలిచి దేశానికి ట్రోఫీ అందించడం ఆనందకరం" అని పేర్కొన్నాడు.ఈ మూడింటిలో ఏది ఇష్టం? ఈ క్రమంలో కామెంటేటర్ హర్షా భోగ్లే.. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ విన్నింగ్ స్టార్లు సంజూశాంసన్, హార్దిక్ పాండ్యా, అభిషేక్‌శర్మలతో కలిసి వైభవ్ సూర్యవంశీని ప్రశ్నలు అడిగాడు. 'ఐపీఎల్‌లో ఒకేఓవర్లో ఆరుసిక్సర్లుబాదడం, ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేయడం.. లేదంటే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించడం.. ఈ మూడింటిలో నువ్వు ఏ రికార్డు సాధించాలనిఅనుకుంటున్నావు" అని వైభవ్‌ను అడిగాడు. గేల్ రికార్డు బద్దలు కొట్టడమే లక్ష్యంఇందుకు బదులిస్తూ.. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు సాధించిన ఆటగాడిగా నిలవడమే తన లక్ష్యమని వైభవ్ సూర్యవంశీ పేర్కొన్నాడు.


## న్యూజిలాండ్‌కు మరో షాక్!

సౌతాఫ్రికాతో తొలి టీ20లో ఓడిన న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్పిన్నర్ ఇష్ సోధికి గాయమైంది. సౌతాఫ్రికాతో తొలి టీ20 మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో సోధి బొటనవేలుకు గాయం కాగా.. స్కానింగ్‌లో భాగంగా వేలు విరిగిపోయినట్లు తేలింది.ఫలితంగా ఇష్ సోధికి నాలుగు వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో సౌతాఫ్రికాతో తొలి టీ20కి దూరమైన ఈ రైటార్మ్ స్పిన్నర్.. మిగిలిన రెండు టీ20 మ్యాచ్‌లకూ దూరమయ్యాడు. ఇదిలా ఉంటే.. సఫారీలతో రెండో టీ20 సందర్భంగా కివీస్ స్పీడ్‌స్టర్ లాకీ ఫెర్గూసన్ జట్టుతో చేరనున్నాడు.కాగా టీ20 ప్రపంచకప్-2026 ఫైనల్లో టీమిండియా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్.. స్వదేశంలో సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా మౌంట్ మాంగనీ వేదికగా ఆదివారం తొలి టీ20లో సఫారీ జట్టుతో తలపడింది.91 పరుగులకే ఆలౌట్ ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్... 14.3 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌటైంది. నీషమ్ (21 బంతుల్లో 26 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. కాన్వే (1), లాథమ్ (7), రాబిన్‌సన్ (6), అరంగేట్ర ఆటగాడు నిక్ కెల్లీ (2), జాకబ్స్ (10), సాంట్నర్ (15) విఫలమయ్యారు.ఎన్కబని మొకొనాకు 3 వికెట్లుఇక ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టి20 అరంగేట్రం చేసిన నలుగురు సఫారీ ప్లేయర్లు విజయంలో కీలక పాత్ర పోషించారు.



# వుదయం సినిమా
MOVIE TIME!

## ఆస్కార్ నివాళుల జాబితాలో కోట శ్రీనివాసరావు.. ధర్మేంద్ర



అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని..గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుక సెగ్మెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది.



## తిమ్మరాజుపల్లి టీవీ ఊరు సాంగ్ రిలీజ్

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నుంచి 'ఊరు సాంగ్' రిలీజ్ చేశారు. వంశీకాంత్ రేఖన బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించారు. మమత రమేష్ పాడారు. 'ఊరు సాంగ్' ఎలా ఉందో చూస్తే 'కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ, ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ, ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగ, గడపల తోరణాలే గంతులు వేసెనుగా, పువులా పరిమళాలే గాలులు వీచెనుగా, ముస్తాభవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు, చిన్నా పెద్దల్లోన మొదలయ్యెను జాతర జోరు..'అంటూ ఆహ్లాదకరమైన పల్లెటూరిలో జరిగే శివరాత్రి జాతర సందడిని, ఆ పండక్కి ఊరు ప్రజలంతా సన్నద్ధమయ్యే తీరును వర్ణిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.



## ఉస్తాద్ భగత్ సింగ్
### ఘనంగా ప్రీ రిలీజ్ వేడుక

'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 'గబ్బర్ సింగ్' స్థాయి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లోని పోలీస్ గ్రౌండ్స్ లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించింది.

## జన నాయగన్.. ఈ సారైనా లైన్ క్లియర్ అవుతుందా?



కోలీవుడ్ స్టార్ దళపతి హీరోగా నటించిన చిత్రం జన నాయగన్. రాజకీయల్లో ఎంట్రీకి ముందే ఇదే తన చివరి చిత్రమని ప్రకటించారు. దీంతో ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి రావాల్సిన ఈ సినిమా.. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దీంతో ఈ మూవీ వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ సినిమా వ్యవహారం కోర్టుకు చేరడంతో రిలీజ్ ఆలస్యమవుతూ వస్తోంది. ఈ మూవీని సెన్సార్ బోర్డ్ రివైజింగ్ కమిటీ రివ్యూ చేయాల్సి ఉంది. ఈనెల 9న జరగాల్సిన రివైజింగ్ కమిటీ ప్రదర్శన వాయిదా పడింది. బోర్డ్ సభ్యుల్లో ఒకరు అనారోగ్యానికి గురి కావడంతో వాయిదా వేయాల్సి వచ్చింది. అయితే ఈ సినిమాను మార్చి 17న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ రివైజింగ్ కమిటీ వీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం తప్పకుండా స్క్రీనింగ్ జరుగుతుందని సీబీఎఫ్‌సీ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయడం జరగనుంది. ఇప్పటికే నిర్మాణ సంస్థ అయిన కేవీఎన్ ప్రొడక్షన్‌కు స్క్రీనింగ్‌కు సంబంధించి అధికారిక మెయిల్ అందినట్లు తెలుస్తోంది.

## విశ్వనాథ్ & సన్స్ టీజర్ రిలీజ్



సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న 'విశ్వనాథ్ & సన్స్' సినిమా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ద్వారా సంజయ్ విశ్వనాథ్ అనే పాత్ర యొక్క ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం భావోద్వేగాలతో నిండిన, ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించనుందని టీజర్ హామీ ఇస్తోంది.
టీజర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను చూపించారు. 40 ఏళ్ల వయసులో కూడా తన కలలను వదలకుండా ముందుకు సాగుతున్న వ్యక్తిగా అతడిని పరిచయం చేశారు. సూర్య ఈ సినిమాలో తండ్రి ప్రేమ, భావోద్వేగ లోతు రెండూ కలిసిన ఒక గాఢమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన తెరపై కనిపించిన తీరు, వెంకీ అట్లూరి రాసిన ప్రభావవంతమైన సంభాషణలు.. సూర్య సినీ ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోయిన అద్భుతమైన ప్రదర్శనలను గుర్తు చేస్తున్నాయి. కథకు కొత్తదనాన్ని జోడించే పాత్రలో మమితా బైజు కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో ఉత్సాహం, చురుకుదనం తీసుకొస్తుందని టీజర్ సూచిస్తోంది. వయస్సు అంతరం ఉన్న అసాధారణ ప్రేమకథను కూడా ఈ సినిమా చూపించబోతున్నట్టు టీజర్‌లో చూచాయగా తెలిపారు. సున్నితమైన భావోద్వేగాలతో అందమైన కథ చెప్పడం వెంకీ అట్లూరి శైలి. తనదైన ప్రత్యేక శైలి రచనతో.. ఈ అంశాన్ని కూడా లోతుగా, భావోద్వేగ పరిపక్వతతో మధురానుభూతిని కలిగించేలా చూపిస్తారు అనడంలో సందేహం లేదు. 'విశ్వనాథ్ & సన్స్' చిత్ర సాంకేతిక విలువలు ఉన్న స్థాయిలో ఉండబోతున్నాయని టీజర్‌తో స్పష్టమైంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన శక్తివంతమైన నేపథ్య సంగీతం, విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసింది. ఛాయాగ్రాహకుడు నిమిష్ రవి గొప్పగా, ఆకట్టుకునే ఫ్రేమ్‌లతో సినిమాను కెమెరాలో బంధిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడు బంగ్లాన్ ప్రేక్షకులను కథలో లీనం చేసేలా ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించారు.


## 40 ఏళ్ల హిట్ సాంగ్.. ఇప్పుడు 50 వేల డాలర్లు



అది దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి ఆల్బమ్. శ్రోతలను ఓ ఊపు ఊపింది. విడుదలైన అన్ని మాధ్యమాల్లోనూ సత్తా చాటింది. ఇప్పటికీ మార్మోగుతూనే ఉంది. అదే 'హవా హవా హే హవా'. ఓ సినిమాలో ఈ పాటను వినియోగించడం వల్ల తాను 50 వేల డాలర్లు (రూ.46 లక్షలకు పైగా) అందుకున్నానని పాక్ పాప్ సింగర్ హసన్ జహంగీర్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన ఆ సినిమా పేరును ప్రస్తావించలేదు గానీ.. రూ.1000+ కోట్లు వసూలుచేసిన రీసెంట్ మూవీ అని చెప్పడం గమనార్హం. సదరు చిత్రబృందం పాటను వాడుకునేందుకు తన అనుమతి తీసుకొని, అంత మొత్తం చెల్లించిందని పేర్కొన్నారు. ఈ సాంగ్ విషయంలో తనకు క్రెడిట్ ఇచ్చారని చెప్పారు. అప్పట్లో కాపీరైట్ వ్యవస్థ అంత పటిష్టంగా లేదని, ప్రస్తుతం తన పాటను వాడుకోవాలనుకున్న వారు ముందుగానే పర్మిషన్ తీసుకుని డబ్బు ఇస్తున్నారని తెలిపారు. 'హవా హవా'ను 1986లో స్వరపరిచానని, 1987లో అది విడుదలైందని గుర్తుచేసుకున్నారు. గతంలో.. బాలీవుడ్ సినిమా 'ఇన్సాఫ్ అప్నే లహూ సే'లోనూ ఈ పాటను వాడారు. జహంగీర్ చెప్పిన దాని ప్రకారం.. ఆ రీసెంట్ హిట్ మూవీ 'ధురంధర్'. ఇందులో ఎస్పీ చౌదరి అస్లామ్‌గా సంజయ్‌దత్ ఎంట్రీ సీన్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఇదే సాంగ్ వినిపిస్తుంది. ఎడారిలో సంజయ్ దత్ విలన్లతో పోరాటం చేసే క్రమంలో వచ్చే ఈ రెట్రో ట్రాక్ ప్రేక్షకులకు మంచి అనుభూతి పంచింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ సినిమా రూ.1300+ కోట్ల కలెక్షన్లతో రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. దీని సీక్వెల్ 'ధురంధర్ 2' ఈనెల 19న రిలీజ్ అవుతుంది. 18న సాయంత్రం ప్రీమియర్స్ ప్రదర్శితం కానున్నాయి.



## అదీ తమన్ సంస్కారం..



పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం సందడిగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో తాను చిత్ర బృందంలోని పలువురు కీలక వ్యక్తుల గురించి మాట్లాడలేకపోయానని దర్శకుడు తాజాగా తెలిపారు. దానికి గల కారణాన్ని వివరిస్తూ.. సినిమా కోసం కష్టపడిన ఆయా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు స్పెషల్ వీడియోను విడుదల చేశారు. "పవన్‌కల్యాణ్‌ను వెయిట్ చేయించామనే టెన్షన్, నిర్విరామంగా ప్రీ ప్రొడక్షన్ పనులు చేస్తుండటంతో వచ్చిన అలసట వల్ల టీమ్‌లో కొందరి గురించి మాట్లాడటం మర్చిపోయా. ముఖ్యంగా రాశీఖన్నా గురించి చెప్పాలి. ఈ సినిమా కథ కూడా వినకుండానే ఆమె నటించింది. పవన్ కల్యాణ్‌తో కలిసి యాక్ట్ చేయాలన్నది ఆమె డ్రీమ్. ఈ ఇద్దరి మధ్య సాగే సన్నివేశాలు ప్రేక్షకులకు మంచి వినోదం పంచుతాయి. బాబ్జీ, రవి కట్ చేసిన టీజర్, ట్రైలర్లకు వచ్చిన స్పందన ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. తమన్‌కు ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా తక్కువే. బావా (తమన్‌ను ఉద్దేశించి).. నేను ఏ పరిస్థితుల్లో ఈ సినిమా బీజీఎం కోసం నిన్ను సంప్రదించానో నీకు తెలుసు. ఓ మ్యూజిక్ డైరెక్టర్‌గా కాకుండా కుటుంబ సభ్యుడిగా నువ్వు పడుతున్న కష్టానికి థాంక్స్ సరిపోదు. పవన్ సినిమాలకు తమన్ బ్యాక్‌గ్రౌండ్ ఏ రేంజ్‌లో ఉంటుందో ఇప్పటికే మీరు చూశారు. ఇప్పుడు దానికి మించి ఉంటుంది. సినిమా తమన్ వద్దకు వెళ్లాక నా నమ్మకం రెట్టింపైంది"



## ఆఫర్ వద్దనలేక..

బాలీవుడ్ ఇండస్ట్రీలో షారుక్ ఖాన్ దీపికా పదుకొణె జోడికి మంచి క్రేజ్ ఉంది. మొదటగా వీరిద్దరి కాంబినేషన్ లో ఓం శాంతి ఓం చిత్రం వచ్చి బాక్స్ ఆఫీస్ దగ్గర విజయం సాధించింది. ఇందులోని వీరి జోడికి మంచి ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత వీరిద్దరి కలయికలో బిల్లు, చెన్నై ఎక్స్‌ప్రెస్, హ్యాపీ న్యూ ఇయర్, పఠాన్, జీరో, జవాన్ చిత్రాలు వచ్చాయి. ఇందులో చాలా వరకు విజయాలు సాధించడంతో హిట్ పెయిర్ గా వీరికి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం షారుక్ ఖాన్ 'కింగ్' చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇందులో కూడా దీపిక కనిపించబోతుంది. కానీ ఈ బ్యూటీ పాత్ర ఇందులో చాలా తక్కువ సమయం ఉండబోతున్నట్లు తెలుస్తుంది. షారుక్ కుమార్తె సుహానా ఖాన్ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో దీపిక, సుహానాకు తల్లి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పాత్ర నిడివి తక్కువే అయినా కూడా షారుక్ మీద అభిమానంతో అది చేయడానికి దీపిక ఒప్పుకున్నట్లు, అలాగే చాలా తక్కువ సమయం ఉండే పాత్ర కావడంతో అద్భుతమైన క్రేజ్ ఉండి పెద్ద మొత్తంలో పారితోషకం తీసుకుంటున్న సమయంలో కూడా రెమ్యూనరేషన్ లేకుండా ఈ సినిమాలో దీపిక నటిస్తున్నట్లు తెలుస్తోంది. వరుస ఫ్లాప్స్ రావడంతో కాస్త గ్యాప్ తీసుకున్న షారుక్ వరుసగా పఠాన్, జవాన్, డంకీ సినిమాలతో విజయాలను అందుకున్నాడు. మళ్ళీ కాస్త గ్యాప్ తీసుకున్న ఈ స్టార్ హీరో 'కింగ్'తో ఏ స్థాయి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.



## మలైకా డేటింగ్ వార్తలపై స్పందించిన బాయ్ ఫ్రెండ్

మలైకా అరోరా సినిమాల్లో అందాలను ఆరబోసి వార్తల్లో నిలవడమే కాకుండా తనకంటే చిన్న వాళ్లతో డేటింగ్ చేస్తూ కూడా పెద్ద ఎత్తున వార్తల్లో నిలుస్తుంది. ఈమె కొన్ని సంవత్సరాల క్రితం నటుడు 'అర్బాజ్ ఖాన్'ను వివాహం చేసుకుంది. కొంతకాలం వీరి సంసార జీవితం బాగానే సాగింది. ఆ తర్వాత వీరిద్దరూ విడిపోయారు. ఈ హాట్ బ్యూటీ, అర్బాజ్ నుండి విడిపోయాక తనకంటే దాదాపు 12 ఏళ్లు చిన్నవాడైన 'అర్జున్ కపూర్'తో డేటింగ్ చేయడం మొదలుపెట్టింది. చాలా సందర్భాలలో ఈ ఇద్దరు ప్రేమ పక్షులు ఒకే చోట కనిపించారు. దాంతో ఈ జంట పెళ్లి పీటలు ఎక్కుతారేమో అని కూడా కొంతమంది భావించారు. అలాంటి సమయంలోనే ఐటెం బాంబు మలైకా, అర్జున్ కపూర్ ఇద్దరూ విడిపోయారు. అర్జున్ నుండి విడిపోయాక తన హృదయంలో ఈ హాట్ బ్యూటీ మరో వ్యక్తికి చోటు ఇచ్చింది. ఈసారి కూడా ఈమె ఏకంగా తనకంటే 19 ఏళ్ళు చిన్న వాడితో డేటింగ్ చేయడం మొదలుపెట్టింది. 52 ఏళ్ల ఈ హాట్ బ్యూటీ హర్ష్ మెహతాతో క్లోజ్ గా ఉంటుంది.
పార్టీలు, ఫంక్షన్లకు కలిసి తిరుగుతున్నారు, వాలెంటైన్స్ డే రోజు ఫారిన్లో వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు వైరల్ అయ్యాయి. ఇలా ఓవైపు 'హర్ష్'తో చాలా క్లోజ్ గా ఉంటున్న ఈ బ్యూటీ తాజాగా సోరబ్ బెడియాతో సన్నిహితంగా ఉన్న ఒక వీడియో బయటకు వచ్చింది. దాంతో మున్ని తన హృదయంలో మరో వ్యక్తికి చోటిస్తుందేమో అని కొంతమంది అభిప్రాయపడ్డారు. వెంటనే హర్ష్, మలైకాతో తను చాలా క్లోజ్ ఫ్రెండ్ అని, అందుకే అంత సన్నిహితంగా ఉన్నారని, అంతకుమించి వారి మధ్యలో ఏమీ లేదని క్లారిటీ ఇచ్చాడు. దీంతో మలైకా లేటెస్ట్ హాట్ మ్యాటర్ క్లోజ్ అయ్యింది.

## వింటేజ్ పవర్ స్టార్‌ని చూస్తారు

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాశి ఖన్నా, శ్రీలీల కథానాయికలు. దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక రాశి ఖన్నా, ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విశేషాలను పంచుకున్నారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.